ఓం

శ్రీ సద్గురుభ్యో నమః

# కఠోపనిషత్తు

(వచనము)

:రచన:

కొల్లి గురుప్రసాదరావు

కపిలేశ్వరపురం, కృష్ణాజిల్లా
డిశంబరు. 1976
నలనామ సంవత్సర మార్గశిర ఏకాదశి

వెల :- రు. 2—00

ఓం

శ్రీ సద్గురుభ్యో నమః

# కఠోపనిషత్తు

(వచనము)

: రచన :

కొల్లి గురుప్రసాదరావు

కపిలేశ్వరపురం, కృష్ణాజిల్లా
డిశంబరు. 1976
నలనామ సంవత్సర మార్గశిర ఏకాదశి

వెల :- రు. 2—00



శ్రీ కొల్లి కోటయార్య
దేశికేంద్రులవారు.
మద్గురువర్యులు, పితృపాదులు.

ఓం

శ్రీ సద్గురుభ్యో నమః

# తొలిపలుకు

కఠోపనిషత్ ముఖ్యమైన దశోపనిషత్తులలో మూడవది. దీనిని యజుర్వేద శాఖగా పరిగణించుచున్నారు. కధారూపముగా ఆత్మ తత్వము స్పష్టముగా తెలియునట్లు చెప్పబడియున్నది. నచికేతుడు యమధర్మ రాజు తనకిచ్చెదనన్న మూడువరములలో మూడవవరముగా మనుష్యుడు మరణించినతర్వాత అతడు ఉండునని కొందరు ఉండడని కొందరు చెప్పుచున్నారు, ఉన్న ఎడల ఆతత్త్వమును గురించి చెప్పవలసినదిగా కోరినాడు దీనికి సమాధానముగానే అనేక ఉపమానములతో ఈ ఉపనిషత్ చెప్పబడినది. యమధర్మరాజు నచికేతుడు అడుగగానే ఆత్మతత్వమును బోధింపక అతనిని ధన కనకవస్తువాహనాదుల నిచ్చెదనని అనేకప్రలోభములకు గురిచేసి అతని అర్హతలను గుర్తించినతర్వాతనే ఆత్మనుగురించి బోధించెను. వైరాగ్యము మొదలగు అర్హతలున్నవారే బ్రహ్మజ్ఞానమునకు అర్హులని స్పష్టమగుచున్నధి. త్యాగేనైకే నామృతత్వమానసుః అని శ్రుతియు చెప్పుచున్నది. సాధనామార్గము కూడా సులభరీతిలోను స్పష్టముగాను తెలియజేయబడినది. అతి సూక్ష్మమైన ఆత్మను చాలా కష్టమైనప్పటికి స్థూల ప్రపంచములోనుండి సూక్ష్మాతి సూక్ష్మమైన ఆత్మను గుర్తించుటకు ఇంద్రియములను బాహ్య వృత్తులనుండి మరలించిన మనస్సును ఏకాగ్రముచేసి విచారణద్వారా, ధ్యానముద్వారా ఆత్మనుగుర్తించుఉపాయము చెప్పబడినది ఆత్మ సాక్షాత్కారమైనవారికి పునర్జన్మలేదని, మోక్షము పొందుదురని, ఆత్మ సాక్షాత్కారముకానివారు వారి కర్మననుసరించి మరల మరల జన్మించుదురని చెప్పబడినది. నచికేతునివలె శ్రద్ధతోను పట్టుదలతోను ప్రయత్నించు వారందరకు మోక్షప్రాప్తి కలుగును.

కఠోపనిషత్ తెలుగులో టీకాతాత్పర్య సహితముగా వెలువడినవి చాలావున్నవి. వావిళ్ళవారిది, ఆత్మ పురాణములోను, అనుభూతి ప్రకాశిక లోను కఠోపనిషత్ వివరణ ప్రకరణలున్నవి. శ్రీ స్వామి చిన్మయానంద గారి ఉపన్యాసములకు తెలుగు అనువాదమున్నది. ఆర్యసమాజ ప్రచారకులు కీ. శే. పండిత అన్నే కేశవార్యశాస్త్రిగారి కఠోపనిషదార్యభాష్యము, యోగనిష్ఠాపరులు, దార్శనికులు, పండిత గోపదేవ్‌గారి టీకాతాత్పర్య, వాఖ్యాన సహిత కఠోపనిషత్తు యున్నవి. ఇవియన్నియు పరిశీలించిన తర్వాత వచనముగాయున్న ఎక్కువమంది జిజ్ఞాసువులకు చదువుకొనుటకు వీలుగా యుండునని వచనముగా వ్రాసినాడను, ( ) ఈ గుర్తులున్నచోట నా భావములను తెలియజేసియున్నాను నా పితృపాదులు, గురువర్యులు నగు శ్రీ కొల్లి కోటయార్యదేశికేంద్రులవారి బోధనల ననుసరించి నా భావములను ఇందు పొందుపరచి యుంటిని. నాకు పరమగురువులైన గుంటూరులో వేదాంత పీఠ స్థాపకులు, శ్రీ మన్మదుపు సుబ్బయాచార్య దేశికేంద్రులవారి 50 వ ఆరాధ నలనామ సం॥ర మాఘ పౌర్ణమికి సర్ణోత్సవముగా జరుపబడు సందర్భమున ఈ 'ఉపనిషత్' ప్రకటనకు పూనుకున్నాను. ఈ వేదాంత పీఠము గుంటూరు మంగళగిరి రోడ్డు, పరమాయకుంటవద్ద ఓంకారేశ్వరాలయము పేరుతో నున్నది. ఈ పీఠము ననుసరించి విజయవాడలో రెండు ఆశ్రమములు, గుడివాడలో హృషీకేశాశ్రమము, కేసరపల్లిలో ఒక ఆశ్రమము. పశ్చిమ గోదావరి జిల్లా ముప్పర్తిపాడులోను, తూర్పు గోదావరి జిల్లా తామరాడ, పసలపూడిలోను యున్నవి. ఈ పీఠముద్వారా విశేష ప్రచారము జరుగుచున్నది. పాఠకులు దీనియందలి భాషకు ప్రాధాన్యమీయక భావమునకు ప్రాముఖ్యమిచ్చి శ్రవణమననాదుల వలన ఫలితమును పొందెదరని ఆశించుచున్నాను.

దీనితో దక్షిణామూర్తి స్తోత్రము తాత్పర్య సహితముగా చేర్చబడమైనది.

నలనామ సంవత్సర (
మార్గశిర ఏకదశి ( ఇట్లు,
17-12-76 ( కొల్లి గురుప్రసాదరావు,

ధర్మంచర, సత్యంవద,

అహింసా పరమోధర్మః.



శ్రీ మన్మడుపు సుబ్బయాచార్య
దేశికేంద్రులవారు.

ఓం

# కఠోపనిషత్తు

(వచనము)

ఓం సహనావవతు, సహనౌభునక్తు, సహవీర్యం కరవా
వహై, తేజస్వినావధీతమస్తు, మావిద్విషావహై
ఓం శాంతిః శాంతిః శాంతిః

పూర్వము వాజశ్రవసుడను ఒక మహర్షి యుండెను. అతడు ఫలాపేక్షచేత విశ్వజిద్యాగము నొనర్చెను. ఈ యాగమును చేయగోరు వారు తమ సర్వసంపదలను దానము చేయవలసి యుండుటచేత వాజశ్రవసుడు తన సర్వస్వమును ఋత్విక్కులకు దానము చేసెను. అతనికి నచికేతుడను ఒక కుమారుడుండెను. అతడు యౌవనము ప్రాప్తించని బాలుడు. ఋత్విక్కులు తమకు దానమీయబడిన గోవులను తోలుకొని పోవుచుండగా నచికేతుడా గోవులను చూచెను. వానిలో కొన్ని బాగా ముసలివై గడ్డి తినుటకుగాని, నీరు త్రాగుటకుగాని, పాలిచ్చుటకుగాని సామర్థ్యము లేనివై యుండెను. అటువంటి గోవులను చూడగానే నచికేతుడు దానముయొక్క ఉద్దేశ్యమేమైయుండునని తనలో తానిట్లు విచారించెను :

'మానవుడు ఈ లోకములో ఎవరికైనా సుఖము కలుగజేసినచో పరలోకములో తాను సుఖమును పొందును. అట్లు ఇతరులకు దుఃఖము కలుగజేసినచో తానుకూడ దుఃఖమునే పొందును. ఏ విత్తనము నాటిన ఆ చెట్టే మొలచునన్నట్లుగా మనముచేసిన కర్మ ననుసరించియే ఫలముకూడా వుండును. గోవులను దానముచేయుట వాని క్షీరమువలన దానగ్రహీత సుఖము పొందవలయుననికదా ! ఈ గోవులు పాలుకూడా ఇవ్వలేని స్థితిలో నుండుటచేత ఋత్విక్కులు సుఖమునకు బదులు వాటిని పోషించవలసి

వచ్చుటచేత దుఃఖమునే పొందుచున్నారు. కనుక నాతండ్రి ఇట్టి గోవులను దానమిచ్చినందువలన దుఃఖమునే పొందును. ఈ విషయమై నా తండ్రిని హెచ్చరించెద' ననుకొని తండ్రిని సమీపించి, 'నాయనా ! నన్నెవరికిత్తు' వనెను. తండ్రి వినిపించుకొననందువలన రెండవసారి, మూడవసారికూడ ప్రశ్నించెను. ఈ ప్రశ్నలకు విసుగుచెందిన వాజశ్రవసుడు నచికేతుని 'నిన్ను మృత్యువున కిత్తు' ననెను. కోపముతో తండ్రి అన్నమాటను నచికేతుడు ఈవిధముగా విచారించుచున్నాడు. 'తన తండ్రివద్దనున్న శిష్యులలో నేను ఉత్తమ శ్రేణికిని, ఇంకను అనేకులలో మధ్యమ శ్రేణికిని చెందినవాడనే, కాని అధమశ్రేణికి చెందినవాడను కాను. అటువంటి నన్ను మృత్యువున కిత్తునని నా తండ్రి పలికినాడే ! నేను యమునకు ఏమిచేయ వలెను ? యముడు నన్నెందుకు ఉపయోగించుకొనునని' విచారించెను.

[ వి :- పుత్రులుకాని శిష్యులుకాని ఉత్తమ, మధ్యమ, అధమ, అధమాధమ భేదములచే నాల్గు విధములుగా నుందురు. ఏ ఏ సమయమున ఏ ఏ పనులవసరమో చెప్పకయే గ్రహించి ఆచరించువారు ఉత్తములు. చెప్పిన పనులను శ్రద్ధాపూర్వకముగా చేయువారు మధ్యములు. చెప్పిన పనులను అశ్రద్ధగా చేయువారు అధములు. చెప్పినను చేయక తిరస్కరించు వారు అధమాధములు. ]

తాను ఉత్తమ శ్రేణికి లేక మధ్యమ శ్రేణికి చెందినవాడనే కాని అధమాధమ శ్రేణికి చెందినవాడను కానని నిశ్చయించుకొనెను. అటువంటి ఉత్తమశ్రేణికి చెందిన తనను తొందరపాటుతో ఆగ్రహమున మృత్యువున కిత్తునని తన తండ్రి పలికినాడనియు గ్రహించెను. మరియు తన తండ్రి తొందరపాటునకు చింతించుచుండుటను గ్రహించి నచికేతుడు తండ్రితో నిట్లనియెను. 'తండ్రీ ! నీవేల చింతించెదవు ? మనపూర్వులు ఎన్నడైనను ఆడినమాట తప్పిరా? నేటి పెద్దలుమాత్రము ఆడినమాటను తప్పుచున్నారా

గతించిన పెద్దలుకాని, నేటి పెద్దలుకాని సత్యమునే పలుకుచున్నారు. వారి యందు అసత్యమనునదే లేదు. తన మాటలను తప్పి నడిచినను మనము శాశ్వతముగా ఇచట ఉండబోవుటలేదు. మనుష్యులు పైరువలె పెరిగి పెద్దవారై, జీర్ణులై మరణించుదురు. రాలిపోయిన గింజలు మరల పైరగు నటుల, మరణించిన వ్యక్తి మరల పుట్టుచున్నాడు. జీవితకాలము అల్పము. జనన మరణములకు గురియగు మానవుడు అసత్యమాడి సాధించు ఘన కార్యమేమున్నది ? మీకు తెలియనిదేమున్నది ? మీరు చింతింపవలదు. మీ మాటను పాలింతును' అని చెప్పి యమాలయమున కేగుటకు అనుమతించవలసినదిగా తన తండ్రిని ప్రార్థించెను.

తన కుమారుడు చెప్పినది విని వాజశ్రవసుడు పూర్వుల వృత్తాంతమును స్మరించి తనకుమారుడు యమునివద్దకు వెళ్ళుటకు అంగీకరించెను.

అంతట నచికేతుడు తండ్రి ఆజ్ఞప్రకారము బయలుదేరి యముని గృహమునకు వెళ్ళెను. నచికేతుడు వెళ్ళునప్పటికి యముడు యింటివద్ద లేక ఎచటికో వెళ్ళియుండెను. మూడుదినముల తరువాత యముడు తిరిగి వచ్చెను. ఆ మూడుదినములు నచికేతుడు భోజన పానీయాదులను స్వీకరింపక యమునిరాకకై ఎదురుచూచుచుండెను. యముడు ఇంటికి వచ్చినదే తడవుగా యముని మంత్రులు మొదలగువారు అతనితో ఇట్లనిరి. 'ఓ వైవస్వతా ! మీరు ఇంటివద్ద లేనిసమయమున అగ్నితో సమానముగా ప్రకాశించు తేజస్సుగల ఒక అతిథి మన ఇంటికి వచ్చియున్నాడు. అతడు వచ్చి మూడుదినములైనను ఏమియు గ్రహింపక మీ రాకకై ఎదురుచూచుచున్నాడు. అతిథిగా ఇంటికి వచ్చినవారిని అర్ఘ్యపాద్యాదుల నొసంగి సత్కరింపనిచో ఆ గృహస్థునకు ఆశ, ప్రతీక్ష, సత్సాంగత్యము, సూనృతము ఇష్టాపూర్త కర్మలు, సంతానము మొదలగువానివలన కలుగు ఫలము లన్నియు నశించును. కనుక సద్బుద్ధిగల గృహస్థులు అతిథిని సత్కరించి

సిరిసంపదలను నిలుపుకొనవలయునను విషయము మీకు తెలిసినదే. కనుక అతిథిని అర్ఘ్యపాద్యాదులతో సత్కరించవలసినదిగా' యమునకు సూచించిరి. అంత యముడు అర్ఘ్యపాద్యాది ద్రవ్యములను తీసుకొని నచికేతుని సమీపించి ఇట్లనుచున్నాడు :

'ఓ జ్ఞానీ! నీవు మాకు అతిథివి, సత్కారార్హుడవు. నేను నీకు నమస్కరించుచున్నాను. నాకు శుభము కలుగుగాక. నేను ఇంటివద్దలేని కారణమున నీవు మూడుదినములుపవసింపవలసి వచ్చినది. నా అపరాధమును క్షమింపుము. నా నమస్కారమును స్వీకరించుటచేతనే నిరాటంకముగా నాకు క్షేమము కలిగినను, దోషనివారణార్థము దినమున కొకటి చొప్పున మూడు వరములను నీ కిచ్చెదను. నీ కిష్టమైనవానిని కోరుకొను' మనెను.

నచికేతుడు యముని సత్కారమునకు సంతృప్తిచెంది ఈవిధముగా వరము లడుగుచున్నాడు ; 'ఓ వైవస్వతా! నా తండ్రి నన్ను మీ ఇంటికి పంపినతరువాత నన్నుగురించి చింతించుచుండును. కావున నాతండ్రి ఎటువంటి చింతలులేక ప్రసన్న చిత్తముతో నుండునటులనుగ్రహింపుము. మరియు మీరు నన్ను తిరిగి ఇంటికి పంపినపుడు నా తండ్రి నన్ను బాగుగా గుర్తించి ప్రేమతో మాట్లాడు నట్లనుగ్రహింపుము. నా తండ్రిని సంతోషపెట్టుటయే నాకు ముఖ్యము. నచికేతుడు తన తండ్రియందు భక్తిశ్రద్ధలు కలవాడై అడిగిన మొదటి వరమునకు యముడు సంతోషించెను. ఓ నచికేతా! ఆరుణి పుత్రుడగు ఉద్దాలకుడను పేరుగల నీతండ్రి పూర్వము నీయందెట్టి ప్రేమతో నుండెనో ఇకముందును అట్టి ప్రేమతోనే నిన్ను చూచును. నా యనుగ్రహమువలన అతడు శాంతచిత్తుడై రాత్రులందు సుఖముగా నిద్రించును. నీవు తిరిగి ఇంటికి వెళ్ళినపుడు నిన్ను గుర్తించును. కోపములేక ప్రేమపూర్వకముగా నిన్నాదరించును.'

నచికేతుడు రెండవ వరము నిట్లడుగుచున్నాడు: 'స్వర్గలోకమున భయముండదు. మృత్యువు, ముసలితనము, ఆకలిదప్పికలు మొదలగు ద్వంద్వము లుండవు. అందుచేత స్వర్గములో నుండువారు సుఖము ననుభవింతురని వినుచున్నాను. ఓ యమధర్మరాజా! ఏ బాధలులేక సుఖముగా నుండు స్వర్గప్రాప్తికి సాధనమైన అగ్నివిద్యను నీవు బాగుగా ఎరుగుదువు. శ్రద్ధావంతుడనైన నాకా యగ్నివిద్య నుపదేశింపుము. ఏ అగ్నిచయనము నాచరించిన యజమానులు జరామరణములు లేక సుఖము ననుభవింతురో, దేవత్వమును పొందుదురో, అట్టి అగ్నిచయన విద్యను రెండవ వరముగా కోరుచున్నాను.'

[నచికేతుడు తండ్రిని సంతోషపరచుటకు మొదటి వరమును కోరెను. ఇది ఇహలోకమునకు సంబంధించినది. రెండవది పరమునకు లేక జన్మాంతరమునకు సంబంధించినదాని నడిగెను.]

'ఓ నచికేతా! స్వర్గసాధనమగు అగ్నివిద్యను బాగుగా తెలిసిన నేను నీకు చెప్పుచున్నాను. ఆ యగ్ని స్వర్గసాధనమేకాక జగత్స్థితికిని కారణమగుచున్నది. మరియు హృదయగుహాయం దున్నదానినిగా తెలుసుకొనుము. లోకముల స్థితికిని దర్శనమునకును ఆదికారణము అగ్నియై యున్నది. అగ్నిప్రకాశమువలన వస్తువులను చూడగలుగుచున్నాము. అగ్నిసంబంధమైన సూర్య నక్షత్రాదుల ఆకర్షణవలన లోకములు ఆకాశమున నిలబడియున్నవి.' అట్టి అగ్నినిగూర్చి యముడు నచికేతునకు బోధించెను. మరియు యజ్ఞవేదిక నెట్లమర్చవలెనో, ఎన్ని ఇటుకలు ఎట్టివి కావలెనో మొదలగు విషయములన్నియు బోధించెను. ఏకాగ్ర చిత్తముతో వినిననచికేతుడు తాను తెలిసికొనినదంతయు విన్నది విన్నట్లుగా యమునకు వినిపించెను. అది విని నచికేతుని ఏకాగ్రతకు, భక్తి-శ్రద్ధలకు యముడు సంతోషించి ఇట్లనుచున్నాడు. నచికేతా! నీ బుద్ధికుశలతకు సంతసించి

తిని. నీ వడిగిన మూడు వరములుగాక మరియొక వరము నిచ్చుచున్నాను. నేను నీకు బోధించిన ఈ అగ్నిచయనము లోకములో నీ పేరుతోనే ప్రసిద్ధి చెందగలదు. అనగా నాచికేతాగ్నిగా ప్రసిద్ధి చెందగల'దని చెప్పి చిత్ర విచిత్ర రూపములుగల ఒక మాలను నచికేతున కొసంగెను.

'నేను నీకు బోధించినటువంటి నీ నామముతో ప్రసిద్ధి చెందునటు వంటి ఈ నాచికేతాగ్నిని ముమ్మారు చయనము చేసినవారు నాచికేతాదు లనబడుదురు. మరియు మాతాపితృ ఆచార్యులచే శిక్షను బొంది, యజ్ఞము, అధ్యయనము, దానమునను కర్మలనుచేసి జననమరణరూప దుఃఖమునుండి విడివడుదురు. వేదమువలన సర్వజ్ఞుడని తెలియదగినవాడును, స్తుతింప దగినవాడును, ప్రకాశస్వరూపుడును, దేవశబ్ద వాచ్యుడును నగు ఈశ్వరుని శాస్త్రమువలన తెలుసుకొని సాక్షాత్కారము చేసుకొనిన వ్యక్తి అత్యంత శాంతిని బొందును.

[ అగ్నిచయనముయొక్క ఫలము స్వర్గరూప సుఖమేనని తెలియ నగును. శాశ్వత సుఖరూప మోక్షమే దీని ఫలమైన ఎడల నచికేతుడు మూడవ వరముగా ఆత్మవిషయక జ్ఞానమునుగూర్చి అడుగవలసిన అవసర ముండదు. మరియు త్రిణాచికేతుడగు విద్వాంసుడు, తల్లి, తండ్రి, ఆచా ర్యుడు అను ముగ్గురిచేత శిక్షను బొంది యజ్ఞము, దానము, అధ్యయనము అను మూటిని తెలుసుకొని నాచికేతాగ్నిని చయన మొనర్చుచున్నాడో ఆతడు అధర్మ, అజ్ఞాన, రాగద్వేషాదులగు మృత్యుపాశములను ఈ శరీర పతమునకు ముందుగనే దూరమొనర్చుకొని దుఃఖరహితుడై స్వర్గలోక మున సుఖము ననుభవించును. ]

'ఓ నచికేతా, నీ వడిగిన రెండవ వరముచేత స్వర్గప్రాపకమగు అగ్నిచయనమును గురించి వివరముగా చెప్పితిని. ఈ అగ్నిచయనము నీ

పేరుమీదుగానే నాచికేతాగ్ని చయనమని జనులు వ్యవహరింతురు. ఇక నీ కిచ్చెదనన్న మూడవ వరమునుకూడా కోరుకొమ్మని యెను.

అంత నచికేతుడు ఆత్మతత్వమును గురించి మూడవ వరముగా అడుగుచున్నాడు. 'యమధర్మరాజా ! మనుష్యుడుమరణించిన పిదప శరీరమునకు వ్యతిరిక్తముగా ఈ దేహమునుండి వేరొక దేహమును బొందునట్టి ఆత్మయను వాడుండునని కొందరు, లేదని కొందరును చెప్పుచున్నారు. సంశయగ్రస్తమైన ఈ విషయమును నీవలన తెలుసుకొన గోరుచున్నాను. నా కిచ్చెదనన్న మూడవ వరముగా ఈ విషయమును బోధింపుము.'

[నచికేతుడు మూడవ వరముగా ఆత్మతత్వమును గురించి యడుగగా యముడు నచికేతునకు గల యోగ్యతను తెలుసుకొనుటకున్నూ, వాని దృఢత్వమును ఎరుగగోరియు ఈ విధముగా అనుచున్నాడు.]

'నచికేతా ! పూర్వము దేవతలుకూడా ఈ ఆత్మతత్వ విషయమున సంశయ గ్రస్తులైరి. ఈ విషయము సులభముగా తెలియునదికాదు. కనుక ఈ విషయమున నన్ను నిర్బంధింపకుము. ఈ వరము వదలి వేరొక వరమడుగుమని' యముడనెను.

'ఓ యమధర్మరాజా ! ఈ ఆత్మతత్వమును గూర్చి దేవతలుగూడా సంశయగ్రస్తులైరని మీరే చెప్పుచున్నారుగదా ! ఈ ఆత్మతత్వము సులభముగా తెలియునట్టిది కాదనియు మీరే చెప్పుచున్నారు. అట్టి సూక్ష్మమైన ఈ ఆత్మతత్వమును బోధించుటకు మీకంటె భిన్నమైన మరియొక బ్రహ్మవేత్త లభింపడు. మోక్షప్రాప్తికి కారణభూతమైన ఈ వరమునకు సమానమైన మరియొక వరముకూడా లేదని దృఢముగా పలికెను.

యముడు నచికేతుని ఇంకను పరీక్షింపదలంచి ఈవిధముగా ప్రలోభపెట్టుచున్నాడు ;

'నూరు సంవత్సరములు జీవించునట్టి పుత్ర-పౌత్రులను అడుగుము. వారితోకూడా సుఖముగా జీవించుటకు వీలగునట్లు ఆలమందలను, ఏనుగులను, గుఱ్ఱములను, బంగారము మొదలగువానిని కోరుకొనుము. విశాలమైన భూభాగమును లేక మాండలిక రాజ్యమును కోరుకొనుము. ఈ సంపదలన్ని యున్నప్పటికిని నేను అల్పాయుష్కుడనైతినేని వీనివలన కలుగు ఫలమేమని నీవు తలంచినచో ఈ సంపదలవలన కలుగు సుఖము ననుభవించుటకు నీ వెంతకాలము జీవింప దలంతువో అంతకాలము సుఖముగా జీవించియుండునటుల వరమును కోరుకొనుము. విస్తారమైన ధనమును, దివ్యములు మానుషములునగు ఏ ఏ కామములుకలవో వానిన్నింటిని కోరుకొనుము. ఈ లోకమున మానవులకందని కోరికలెన్నియో కలవు. ఆ కోరికలన్నింటిని నీవు స్వేచ్ఛగా యడుగుము. రథములతోను, వాద్యములతోను కూడినట్టి స్త్రీలను నీ కొసగుచున్నాను. ఈ స్త్రీలచే అన్ని విధములైన సేవలు చేయించుకొనుము. అన్ని సుఖముల ననుభవింపుము. అంతేకాని మరణానంతర విషయము నన్నడుగకు'మని యముడు చెప్పెను.

ఈవిధముగా యముడు తనను ప్రలోభపెట్టుచున్నను చలింపక ధీర చిత్తముతో నచికేతు డిట్లనుచున్నాడు ; 'ఓ యమధర్మరాజా ! నీ విప్పుడు నా కిచ్చెదనని చెప్పిన ఈ భోగపదార్థములన్నియు నశ్వరములు. అనగా నే డనుభవించునవి రేపుకూడా వుండునని చెప్పుటకు వీలుకానివి. ఈ భోగసాధనము లన్నియు మానవుని ఇంద్రియ పటుత్వమును నశింప జేయును. మరియు నీవు దీర్ఘాయువు నిచ్చెదనని చెప్పుచున్నావు. కాని ఎంత కాలము జీవించినను ఎన్ని సుఖముల ననుభవించినను అంతయు అల్పము గానే తోచును. కావున ఈ సిరిసంపదలు, రథములు, గుఱ్ఱములు, స్త్రీలు మొదలగునవి నీకే యుండుగాక. ఎందుకనగా విస్తారమైన ధనముచేత మనుజునకు సంతృప్తి కలుగుననుట అసంభవము. భోగముల ననుభవించి తృప్తినిపొందినవారులేరు. నీవంటివారి దర్శనమువలననే ధనము లభించును.

మీ దయ యున్నంతకాలము మేము జీవించి వుండగలము. మీ దర్శన భాగ్యము కలిగినపిదప జీవితమునకు, ధనమునకు కొరత ఏల యుండును? కావున నాకు ఈ వరములేవియు అక్కరలేదు. దయతో నాకు మరణా నంతర స్థితినిగురించి తెలుపు వరమునే ఇచ్చెదరుగాక! నేను కోరదగినది మరేమియు లేదు. ఇంకను జరావస్థ లేనటువంటిన్ని అమరులై నటువంటి మీవంటివారి దర్శనమును పొందినపిదప ఏ మానవుడు ఈ భూమిమీద దీర్ఘకాలము జీవించుటకు కోరుకొనును? అధోలోకమగు ఈ భూమియందున్న మానవుడు నిత్యము జీర్ణించుచు చివరకు మరణించునని తెలిసికూడా ఎవరు దీర్ఘజీవనమును కోరుకొందురు? ఒకవేళ అట్లుకోరినను దానివలన ప్రయోజనమేమి? సౌందర్యవతులైన స్త్రీల సాంగత్యసుఖము శాశ్వతముకాదని తెలిసియు అట్టి అనిత్య సుఖములకొరకు ఎవరు దీర్ఘ కాలము జీవింపగోరుదురు. ఓ మృత్యుదేవతా! మరణానంతరము ఆత్మ యున్నదా లేదా అను సంశయము బహుజనులకు కలుగుచున్నది. దేవతలు కూడా ఈ విషయమున సంశయగ్రస్తులైరని మీవలనకూడా వింటిని. ఇట్టి ఆత్మనిర్ణయముకు సంబంధించి విషయమును మించిన విషయము మరొకటిలేదు. ఈ ఆత్మజ్ఞానవిషయము అతిసూక్ష్మమనియు, సులభముగా తెలిసికొనదగినది కాదనియు వింటిని. ఓ ఆచార్యా: ఈ నచికేతుడు వేరొక వరమును కోరడు. మీరు నాయందు దయయుంచి ఈ విషయమునే బోధింపు'డని ప్రార్థించెను.

ప్రథమవల్లి సమాప్తము.

—: ద్వితీయవల్లి ప్రారంభము :—

ఇంతవరకు యముడు నచికేతునకు అనేక విధములగు సంపదల నిచ్చెదనని ప్రలోభపెట్టినను వానిని సరకుగొనక మరణాంతర విషయమునే దృఢముగా కోరుటచేత వాని యోగ్యతను గుర్తించి యమధర్మరాజు వానికి జ్ఞానోపదేశము చేయనారంభించుచున్నాడు ;

'నచికేతా ! ఈ ప్రపంచములో మానవులు నడచుకొనుటకు రెండు మార్గములుకలవు ఒకటి శ్రేయోమార్గము. రెండవది ప్రేయోమార్గము. ఈ రెండును విభిన్న ప్రయోజనములు కలవియై మానవుని బంధించుచున్నవి. అందు శుభము కల్గించుచు మోక్షమును కలుగజేయునది శ్రేయోమార్గ మనబడును. లౌకిక సుఖములను కలిగించు స్త్రీ ధనాదులను అనుభవింప జేయునది ప్రేయోమార్గము. విషయాదుల ననుభవించు సుఖముగానున్నట్లు తోచి చివరకు దుఃఖమును కలుగజేయునది ప్రేయోమార్గము. మొదట కష్టముగ నున్నట్లుండి చివరకు శాశ్వత సుఖమును కలుగజేయునది శ్రేయో మార్గము. కనుక శ్రేయోమార్గము ననుసరించువారికి శాశ్వత సుఖము లభించును. ప్రేయోమార్గము ననుసరించువారు శాశ్వత సుఖయనకు దూరులై దుఃఖముల పాలగుదురు. కావున విజ్ఞులగువారు శ్రేయోమార్గమునే అనుసరించెదరు.

మానవులకు శ్రేయోమార్గము ప్రేయోమార్గము అను ఈ రెండును అనుసరింపదగినవిగానే తోచును. ఈ రెంటిలోకల భేదమును సామాన్య మానవుడు గుర్తింపలేకున్నాడు. ధీరుడగు విద్వాంసుడు ప్రేయస్సుకంటె శ్రేయస్సే శ్రేష్ఠమైనదని తలంచి దానినే అనుసరించును. మందబుద్ధికల

వాడు ధనమును, గృహారామ క్షేత్రాదులను సంపాదించి వానిని కాపాడుట యనెడి యోగక్షేమాత్మకమైన ప్రేయోమార్గమునే శ్రేష్ఠమైనదానినిగా తలంచి ఆ మార్గమునే అనుసరించును. సాధారణముగా మానవులలో అధికసంఖ్యా కులు ధనసంపాదనకు దాని రక్షణను గొప్పగా భావించి తమ జీవితములను గడుపుచున్నారు. వారు పరమును గురించి ఆలోచింపరు. వారు శాశ్వత సుఖమునిచ్చు శ్రేయోమార్గమునకు దూరముగా నుందురు.

'నచికేతా! ప్రపంచములో ఎక్కువమందిని ఆకర్షించునటువంటిన్నీ ఎక్కువమంది కోరుకొనునటువంటిన్నీ పుత్ర-పౌత్రులను, ప్రియమును కలుగజేయు స్త్రీలను, ధన కనక వస్తు వాహనములను, ఎన్నింటినో ఇచ్చెదనని నిన్ను మాటిమాటికి ప్రలోభపెట్టినను నీవు వాటినన్నిటిని వదలి పెట్టితివి. నీ బుద్ధి చాతుర్యమునకు ఆశ్చర్యపడు చుంటిని. అధికసంఖ్యాకు లగు సామాన్య మానవులు ధన కనక వస్తువాహనములను సంపాదింపవలె ననెడి వ్యామోహములో పడి దుఃఖములపా లగుచున్నారు. నీవు వానిని కోరవైతివి. వానిలోనుండు దోషములను గుర్తించిన నీ జన్మ ధన్యము. సంసారిక సుఖములకు లోబడని నీ వంటివరే ఆత్మ జ్ఞానమునకు అర్హులు,

శ్రేయో మార్గము మోక్షదాయకమనియు, ప్రేయో మార్గము లౌకిక సుఖములనిచ్చుననియు చెప్పియుంటిని ఈ రెండు మార్గములలో ఎంతో భేదమున్నది. చీకటి వెలుతురులవలె పరస్పర భిన్నములై వివిధములైన ఫలములు గలవి. అందుచే విద్వాంసులు శ్రేయోమార్గమును విద్యఅనియు, ప్రేయో మార్గమును అవిద్య అనియు, చెప్పుచున్నారు. శ్రేయోమార్గము ననుసరించువారు వివేకియై మోక్షమును పొందుదురు. ప్రేయోమార్గమునను సరించువారు అవివేకియై మోక్షమునకు దూరమగుదురు. అవిద్యా రూపమగు

స్త్రీ, పుత్ర, ధనాదులను విడిచిపెట్టి విద్యా రూపమగు మోక్షమును కోరిన నీవు ధీరుడవు. అవిద్యయందు అనగా అజ్ఞానాంధకారరూపమగు ప్రేయో మార్గము ననుసరించువారు ఏది తమకు సుఖమును కలుగజేయునో ఏది దుఃఖమును కలుగజేయునో గుర్తించని వారైనప్పటికి తమ్ము తాము ధీమంతులమనియు. శాస్త్రజ్ఞులమనియు, తలంచుదురు. అట్టి మూఢులు అనేక కుటిల మార్గముల ననుసరించుచు నిరంతరము ధన సంపాదన కొరకై తమ జీవితముల వెచ్చింతారు. అటువంటివాడు గ్రుడ్డివానిననుస రించు గ్రుడ్డివాడు పొందుఫలమునే పొందుదురు. అనగా జరా మరణ రోగాది రూపమైన దుఃఖముల పాలగుదురు. వారు పరలోక ప్రాప్తి సాధనములగు తపస్సు మొదలైన వాని నాచరింపరు. అహింస, సత్యము, శౌచము, బ్రహ్మ చర్యము, అపరిగ్రహము, మొదలగు వాని నాచరింపరు.

శ్రేయో మార్గము ననుసరించువారు అరుదుగా నుందురు. లోకములో నూటికి కోటికి ఎవరో ఒకరే నీ వంటివారు ఆత్మజిజ్ఞాసకలవారుందురు. మానవులలో అనేకులు ఆత్మనుగురించి వినుటకు నోచుకొనరు. ఆత్మ జ్ఞానమును ప్రబోధించి ఉపదేశములను వినుటకు అవకాశము కల్పించుకొనరు. ఒకవేళ అట్టి ఉపదేశములను వినుచుండినను వారిలో ఎక్కువమందికి ఆత్మయననేమో తెలియదు, ఆత్మ తత్వమును చెప్పగలవారు కూడా అరుదుగా వుందురు. ఆత్మను గురించి విని వినిన దానిని మనననిధి ధ్యాసలచే ఆత్మ నెరుంగువారు కుశలురు ఆత్మ తత్వమును బోధించువారు కూడా అతి కుశలురై యుండవలెను. అట్టి నిపుణుడైన అచార్యునిచేత భోధింపబడి ఆత్మ నెరుగు వ్యక్తిని అద్భుతమైన వ్యక్తి యనక తప్పదు.

వివేకవైరాగ్యములు, శమదమాది సద్గుణములు, ముముక్షుత్వము గలవారు మాత్రమే ఆత్మజ్ఞానమునకు అర్హులైనట్లుగా శాస్త్రజ్ఞానమొకటే గాక అనుభవజ్ఞానము కలవారు మాత్రమే ఆత్మోపదేశము చేయుటకర్హులని విశదమగుచున్నది. శాస్త్రజ్ఞానమున్నవారు చాలామంది వుండవచ్చును. వారందరును ఆత్మను గురించి బాగుగా చెప్పలేరనియే తెలియుచున్నది. ఆత్మసాక్షాత్కారమొనర్చుకొనిన అనుభవజ్ఞానులు మాత్రమే ఆత్మను గురించి చక్కగా బోధింపగలరు. అందుచేతనే ఆత్మ తత్వమును బోధించువారు అరుదుగా నుందురు అని చెప్పబడినది. భగవద్గీత కూడ 'తత్వదర్శినః' తత్వదర్శినులైన నీకు జ్ఞానబోధ చేయుదురని చెప్పుచున్నది.

నచికేతా: ఆత్మజ్ఞానములేని సామాన్య మానవుని చేత ఈ ఆత్మ తత్వము ఉపదేశింపబడినను అట్టి ఉపదేశము పొందినవానికి ఎన్నివిధముల ఆలోచించినను ఈ ఆత్మ తత్వము తెలియబడదు. ఆత్మ సూక్ష్మ పదార్థములకన్న అతి సూక్ష్మమైన దగుటచేత శాస్త్ర జ్ఞానముచే తర్కించుటకు లేక ఊహించుటకు వీలుకానిది. ఆత్మ సాక్షాత్కారము పొందిన ఆచార్యుని చేత బోధింపబడిన వ్యక్తికి ఆత్మ విషయమున ఉన్నదా లేదాయను సంశయములు నివృత్తియై ఆత్మ జ్ఞానము కలుగును, అనుభవ జ్ఞాన హీనులు ఆత్మను గురించి బోధించిన, గ్రుడ్డివారు ఏనుగును గురించి వర్ణన చేసినట్లుగానే యుండును. ఆత్మ విషయక జ్ఞానము తర్కముచేత త్యజింపరాదు. వంటయింటినుండివచ్చు పొగనుచూచి నిప్పులేనిదే పొగ రాదని తర్కించి వంటయింటిలో నిప్పున్నదని ఊహించుచున్నాము. కాని ఆత్మ అతి సూక్ష్మమగుటవలన ఆత్మ విషయక చిహ్నములు ప్రత్యక్షము గావు. అందుచేత తర్కము మూలమున ఆత్మను తెలిసికొనలేము. అట్టి

తర్కముననబన ఆత్మను నిరసింపరాదు. తర్కముకంటె భిన్నమైన ఆత్మ విదుల ఉపదేశము వలన కలిగిన జ్ఞానము సరియైనది. నీవెట్టి ధృఢ సంకల్పముతో ప్రలోభములకు లోనుగాక ఆత్మ జ్ఞానము నొందుటకు ధీరచిత్తముతో నుంటివో, అట్టి సత్యధృతిపైన నీవంటి శిష్యులు మాదగ్గరకువచ్చి ఆత్మ జ్ఞానమును పొందుదురుగాక!

ధనం, గృహారామ క్షేత్రం మొదలగు సంపదలన్నియు అనిత్యములని నేనెరుగుదును. కామ్య కర్మలవలన కలుగు ఫలము ఐహికాముష్మిక సుఖములు కూడా అశాశ్వతమని ఎరుగుదును. అనిత్యములగు సాధనలచేత నిత్యమగు ఆత్మ తత్వమును పొందజాలమనియు నేనెరుగుదును. అందుచే కర్మఫలాపేక్షను వదలి కర్తవ్య కర్మలను నాచికేతాగ్ని నిచయన మొనరించి సాపేక్షిక నిత్యత్వం గల యమాధికారమును పొందితిని.

(కామ్య కర్మలను ఫలాపేక్షతో చేయువారు మోక్షంపొందజాలరు. ఫలాపేక్ష లేకుండా కర్మలనాచరించువారు చిత్తశుద్ధిని పొంది జ్ఞానసముపార్జనద్వారా మోక్షమును పొందుదురు.)

యముడు నచికేతుని మరల ఇట్లు ప్రశంసించుచున్నాడు. నచికేతా! నీవు బుద్ధిమంతుడవు, ధైర్యశాలివి కనుకనే కామ భోగ ప్రాప్తిని త్యజించితివి, జగత్తు యొక్క స్థితిని గ్రహించితివి. క్రతువుల వలన కలిగెడి ఫల మెంతటి విశాలమైనదైనను ఇహమందు రాజ్యాధి పత్యమును, పరమందు హిరణ్య గర్భపదవిని కల్గించునదైనను, ఇవి అశాశ్వతమని ఎరిగి త్రోసి పుచ్చితివి. స్తుతింప దగిన సర్వమాన్యతను, కీర్తిని కోరవైతివి. ఇవి యన్నియు సంసార భోగమునకు సంబంధించినవే కాని పరతత్వము

నకు సంబంధించినవి కావని వదలితివి. నీ వంటి ఉత్తమ గుణములు కలవాడు దొరకుట దుర్లభము.

నీవు తెలిసికొన దలచిన ఆత్మ తత్వం గురించి చెప్పుచున్నాను వినుము. ఆత్మ అతి సూక్ష్మ మగుటచేత సులభముగా తెలియబడక పోవుటచే దుర్దర్శుడనబడును. ఈ ఆత్మ ప్రాణుల బుద్ధి గుహయందు ప్రవేశించి గుప్తముగా యున్నది. శబ్దాది విషయములచేత మరుగు పరచ బడియున్నది, సనాతనమైన ఆ ఆత్మను ధీరుడైన విద్వాంసుడు అధ్యాత్మ యోగచేత తెలిసికొనును అనగా శబ్దస్పర్శాది విషయములనుండిఇంద్రియ ములను మరల్చి చిత్తమును ఆత్మయందు ప్రవేశపెట్టుటయను యోగము ద్వారా ఆత్మను తెలిసికొనును. అట్టి ఆత్మసాక్షాత్కారమైనవారు హర్షశోక ములు మొదలగు ద్వంద్వములను విడచి నిర్వికారస్థితియందుండెదరు. ఆత్మ తమ బుద్ధి గుహయందే వున్నప్పటికిని విషయాదులతో కూడుకొని యుండు సాధారణ మానవులు తెలిసికొనలేకయున్నారు.

మృత్యువువశుడగుటచేత మనుష్యుడు మర్త్యుడనబడుచున్నాడు. ఈ మనుష్యుడు నేను చెప్పబోవునట్టి అత్మతత్వమును, ఆచార్యు నుపదేశ మును శ్రద్ధగావిని మననాదులచేత బాగుగా నెరింగి ఆనందాది ధర్మ యుక్తమును, అతి సూక్ష్మమును అగు ఆత్మ తత్వంను శరీరాదికంనుండి వేరు పరచి బాగుగా గ్రహించును, అట్లాత్మను బొందిన విద్వాంసుడు సర్వ దుఃఖంలనుండి విముక్తుడై బ్రహ్మానందము ననుభవించును. అర్హు డైన నచికేతునకు మోక్షద్వారంలు తెరువబడి యున్నవని తలంచు చున్నాను.

యమధర్మరాజు ఇంతవరకు చెప్పిన విషయములు విని నచికేతుడు తనలో తానిట్లన కొనెను. అశాశ్వతమైన సాధన ద్వారా శాశ్వత పదవిని పొందజాలమని చెప్పుచునే నాచికేతాగ్ని చయనము చేత తాను ఈ నిత్య పదవిని పోందితినని చెప్పుచున్నాడు, మరల ఈ ఆత్మ అతి సూక్ష్మమైన దని, సులభముగా పొందదగినది కాదని, ఇంద్రియ నిగ్రహము ద్వారా యోగామభ్యసించినవారు తెలిసికొన గలరని చెప్పుచున్నాడు. నీవంటివారే దీని కర్హులని మధ్యలోనన్ను ప్రశంసించుచున్నాడు. అసలు విషయము చెప్పకుండా దాటవేయునేమో యని సంశయించి నచికేతుడు యమధర్మ రాజు నిట్లడుగుచున్నాడు.

ఆచార్య: నేను బ్రహ్మోపదేశమునకు అర్హుడనైతినేని, మీకు నా యందు సంపూర్ణ అనుగ్రహమున్న మెడల వేదవిహిత కర్మానుష్ఠానము దాని ఫలమునకు వేరైనట్టియు, వేదనిషిద్ధమైన కర్మానుష్ఠానము, దాని ఫల మునకు వేరైనట్టియు, కార్యకారణ జగత్తునకు వేరైనట్టియు కాలత్రయ ముచే బాధింపబడక అపరిచ్ఛిన్నమైనదో అట్టి పరామాత్మ తత్వమును నీ వెరిగి యున్నావు. నీ వెరిగిన ఆ తత్వమునే నాకు బోధింపుమని నచికే తుడు యముని ప్రార్ధించెను.

యముడు అతని ప్రార్ధనను మన్నించి పరమాత్మ తత్వ విశిష్ట త్వము నిట్లు చెప్పుచున్నాడు-వేదములన్నియు ఏ వస్తువు పొందధగినదని చెప్పు చున్నావో, ఏ వస్తువును పొందుటకు సర్వ తపస్సులు చేయబడు చున్నవో. ఏ వస్తువును పొందగోరి గురుకులవాస రూపమగు బ్రహ్మ చర్యం నాచరించుచున్నారో నీవు ఏ వస్తువును తెలియగోరుచున్నావో ఆ వస్తువును సంగ్రముగ చెప్పుచున్నాను. ఆ తత్వము 'ఓం అని చెప్పబడు

చున్నది, అది ఓంకార శబ్ద వాచ్యము, ఏ పదము నుచ్చరించుటచేత ఏ వస్తువు శ్రోతకు స్ఫురించుచున్నదో ఆ వస్తువు ఆ పదమునకు వాచ్యమగును. ఆ పదము వాచికము. రామకృష్ణాది నామములనుచ్చరించునపుడు రాముని, కృష్ణుని, రూపములు మనకు స్ఫురించునట్లుగా ఓంకారము నుచ్చరించుటచేత నామరూప రహితమైన, సూక్ష్మమైన పరబ్రహ్మమే స్ఫురించును, ఓంకారము వాచికము, పరబ్రహ్మము వాచ్యము, నీవెరుగగోరిన తత్వ మిదియే. ఈ పరబ్రహ్మ తత్యమే నాశములేనిది. అన్నిటికంటె గొప్పది అతి సూక్ష్మమైనది, మహత్తుకన్న మహత్తైనది, అణువుకన్న అణువైనదియునగు, ఈ బ్రహ్మము నెరిగిన వారి కోరికలన్నియు సిద్ధించును.

ఈ ఓంకారము పరబ్రహ్మ ప్రాప్తికి మిక్కిలి శ్రేష్ఠమైన సాధనము. ఈ సాధనము నెరిగినవారు బ్రహ్మలోకమున పూజింపబడుదురు. బ్రహ్మమున సుఖింతురు, బ్రహ్మను తెలిసికొనుటకు ప్రయత్నించువారికి బ్రహ్మానందమునను‌భవింపగోరువారికి చిత్తైకాగ్రత మిక్కిలి యవసరము. అట్టి చిత్తైకాగ్రతకు ఓంకారరూపజపమే మిక్కిలి శ్రేష్ఠమైనది. వాచికమైన ఈ ఓంకారము వాచ్యమైన పరబ్రహ్మమునేస్ఫురింపజేయును. మరియు ఓంకారము అకార ఉకార మకార అమాత్రలను నాల్గుమాత్రలు కలది. స్థూలసూక్ష్మ కారణ మహాకారణములను శరీరములను, జాగ్రత, స్వప్న, సుషుప్తి, తురీయములను నాలుగవస్థలు కలది. ఈ మాత్రలు శరీరములు, అవస్థలు, వాచికములు. వాచ్యమైన పరబ్రహ్మమేలక్షార్థము ఈ

విధమైన ధ్యానము చేయుటచేత, పరబ్రహ్మమునే పొందింప జేయుటచేత, ఓంకారలంబనమే అన్నిటికంటె శ్రేష్ఠమైనది.

ఆత్మ శరీరముతోపాటు పుట్టునదికాదు. శరీరము నశించిన దానితో పాటు నశించునదికాదు. ఈ ఆత్మకు కారణ భూతమైనదేదియులేదు. శరీరమునకు శుక్ల శోణితములు కారణమైనట్లు ఆత్మకు ఏ కారణమునులేదు. ఇది దేనికి కార్యము కానందున నశించునదికాదు. ఈ ఆత్మనుండి ఏదియు పుట్టుటలేదు. వికారములు. పరిణామములేక. భూతభవిష్యద్వర్తమాన కాలంలో ఒకటిగానే యుండుటచేత నిత్యుడనబడును. వృద్ధిక్షయములు లేనిది కనుక శాశ్వతమనబడును. పురాణమనబడును. శరీరము ఖండింప బడినను ఆత్మ ఖండింపబడదు. శరీరమునకు గర్భములో నుండుట, పుట్టుట, పెరుగుట, పరిణామము చెందుట, క్షీణించుట, మరణించుటయను వికారములు కలిగియున్నది. ఆత్మకు ఏ వికారములులేవు శరీరంలో నున్నప్పటికిని ఆత్మకు శరీర ధర్మములంటవు. సామాన్య మాన మానవులు శరీరమునే ఆత్మగానెంచి శరీరముతోబాటు ఆత్మయును నశించునని తలంతురు. కనుకనే వారు నేనుచంపెదననియు, చంపబడుచున్నాననియు, తలంతురు. ఆ విధముగా తలంచువారిరువురును ఆత్మయనగా నేమియు తెలియనివారే. ఆత్మ ఎవరిని చంపుటలేదు. చంపబడుటలేదు.

ఇపుడు ఆత్మను తెలిసికొను విధము చెప్పబడుచున్నది.

పరమాత్మ మిక్కిలి సూక్ష్మపరిమాణముగల శ్యామాదికము కంటెను మిక్కిలి సూక్ష్మమైనది. మహత్పరిమాణముగల ఆకాశాదికం కంటె మిక్కిలి మహత్తరమైనది. సర్వ వ్యాపక మగుటచేత పిపీలికాది

బ్రహ్మ పర్యంతం వ్యాపించియున్నది. అందుచేత అణువుకంటె అణువుగాను, మహత్తు కంటె మహత్తుగాను యున్నది. మరియు ప్రాణుల బుద్ధి గుహయందు లేక హృదయాకాశమునందు ఈ ఆత్మయున్నది. అట్టి ఆత్మను తన హృదయాకాశమున సాక్షాత్కారము చేసికొనుటకు అక్రతువు-అనగా నిష్కామకర్మల నాచరించువాడుగాంచుచున్నాడు. ఎందుచేతననగా వేదవిహిత కర్మలను ఫలాపేక్ష లేక ఆచరించువాని చిత్తము నిర్మలమగును, ఎప్పుడు ఇంద్రియములు, మనస్సు నిర్మలమగునో అపుడు వాని బుద్ధియు ప్రసన్నముగా నుండును. బాహ్యవిషయములనుండి మరలిన బుద్ధి మాత్రమే పరమాత్మ మహిమను తెలిసికొనును. ఇట్లు తెలిసికొనిన వాని శోకము నశించును, ఆత్మానందం ననుభవించును.

ఆత్మ సర్వవ్యాపకమగుటచేత ఆత్మలేని తావులేదు. పరిచ్ఛిన్నత్వమున్నవాటికేగదా కదలుటకవకాశమున్నది. అపరిచ్ఛిన్నుడు, అచలుడు అయిన ఆత్మ దూరము పోవునట్లగపడుచున్నాడు. ఆనందము మరియు ఆనంద రహితమునై యున్న ఈ ఆత్మను నాకంటె వేరైనవాడెవడు తెలిసికొనగలడు. అంతర్ముఖులు, ఇంద్రియ నిగ్రహపరులైన జ్ఞానులు దప్ప విషయాదులతోకూడి యుండుసామాన్యులు ఆత్మను తెలియలేరు.

ఈఆత్మ శరీరము లేనివాడు కనుక అశరీరయనబడును శరీరములు అనిత్యంబు జీర్ణించి పోవునవి. ఆత్మ నిత్యుడు, సర్వవ్యాపకుడును. అచలుడునై అంతటా ఎల్లప్పుడూ వుండును. అందుచేత అనిత్యములైన శరీరములందు నిత్యుడై యుండును. అట్టి గొప్పవాడును, సర్వవ్యాప్తియు నగు ఆత్మను ధ్యానాదుల మూలమున తెలిసికొనిన జ్ఞాని శోకింపడు.

వేదాధ్యయనం చేసినవారు ఆత్మను గురించి ఈ విధంగా చెప్పబడిన దని ఉపన్యసింతురు. అట్టివారి ఉపన్యాసముల మూలంగా ఆత్మను పొందుటకు శక్యంకాదు. కొందరు శాస్త్రములను చదివి బాగుగా జ్ఞప్తియందుంచు కొనగలరు. అట్టి ధారణాశక్తి వలన గూడా ఆత్మను పొందుటకు శక్యం గాదు. అనేక శాస్త్రములను వినుటచేత గాని చదువుట చేతగాని ఆత్మ లభ్యం కాదు. నిష్కాముడై ఆత్మను మాత్రమే వరించునో ప్రార్థించునో అట్టి వారికి మాత్రమే ఆత్మ పొంద శక్యమగును. వారి హృదయమందు ఆత్మ ప్రకాశించును. తన స్వరూపం తెలియునట్లు చేయును. మరియు శాస్త్ర నిషిద్ధమైన చోరత్వ, వ్యభిచారాది. పాపకర్మల నాచరించు దుశ్చరితునకు ఆత్మప్రాప్తి శక్యముకాదు. ఇంద్రియములను విషయాదులనుండి మరలించిన వానికి ఏకాగ్ర చిత్తం లేనివానికిని మనస్సనేక విషయము లందు లగ్నమైన వానికిని, ఈ ఆత్మను పొందుట సాధ్యంకాదు. ఒకవేళ ఏకాగ్ర చిత్తం కలిగినప్పటికి ఇహపరసుఖములందాసక్తి గల వానికి కూడ ఆత్మ ప్రాప్తి కాదు. ఎవరు పాప కర్మల నాచరింపరో ఈశ్వరార్పణ బుద్ధిచే సత్కర్మల నాచరించుచు ఇంద్రియ నిగ్రహం కలిగి చిత్తైకాగ్ర తను కలిగియుందురో అట్టిశమద మాది సాధన సంపత్తి కలవారే ఆత్మను బొందగలరు. ఇతరులకు శక్యం కాదు.

ఈ ప్రపంచం విధాయక, ధారకమను రెండు శక్తులతో కూడి యున్నది. బ్రహ్మ, క్షత్రములనబడు ఈ రెండు శక్తులును ఆ యాత్మకు అన్నమగుచున్నది. మరియు మృత్యువు అన్నములో నంజుకొను ఊర గాయ యగుచున్నది. అట్టి వానిని ఎవడు తెలిసికొనగలడు సాధన సంపత్తి గలవారేగాని ఇతరులు తెలిసికొనలేరు.

(సృష్టిస్థితిలయములు ఏ ఆత్మయందు జరుగుచున్నవో అట్టి ఆత్మ కూపస్థ మండూకము ఇతర ప్రపంచం నెరుగనట్లు ప్రాకృత బుద్ధిగలఅజ్ఞానులు ఆత్మ నెరుగజాలరు. సాధన సంపత్తికల బ్రహ్మ జ్ఞానులే ఆత్మను పొందకలరు.)

ద్వితీయవల్లి సమాప్తము.

—: తృతీయవల్లి ప్రారంభము :—

యమధర్మరాజు జీవాత్మ పరామాత్మల గురించి పరామాత్మను పొందు విధానం నచికేతునకు స్పష్టంగా వివరించుచున్నాడు.

నచికేతా! స్వయంకృతమగు కర్మ ఫలం ననుభవించు నిమిత్తము జీవాత్మ పరాత్మలు ఈ శరీరంలో శ్రేష్ఠమైనటువంటి బ్రహ్మకు స్థానముగా నున్నటువంటి బుద్ధి గుహయందు (హృదయాకాశం)ప్రవేశించుచున్నారు. ఈ విధంగా ప్రవేశించిన వీరిద్దరు నీడ ఎండలవలె పరస్పర విరుద్ధలక్షణం గలవాడుగా నున్నారని బ్రహ్మవేత్తలు చెప్పుచున్నారు. అంతేగాక పంచాగ్నుల నొనర్చువారున్ను త్రిణాచికేతాగ్ని చయనము నొనర్చు వారును ఈ విధముగనే చెప్పుచున్నారు.

(జీవాత్మ పరమాత్మ లిరువురు కర్మఫలం ననుభవించుటకు ఈ శరీరంలో ప్రవేశించినటుల చెప్పబడినది. జీవాత్మ మాత్రమే కర్మఫలము

ననుభవించును. 'శరీరస్థోపి కౌంతేయ నకరోతి నలిప్యతే' అని భగవద్గీతలో కూడా చెప్పినటుల పరమాత్మ కర్మలొనర్చుటలేదు. వానిఫలము ననుభవించుటలేదు. అయినప్పటికి ఛత్రి న్యాయమున వారిద్దరు అనుభవించుచున్నటుల చెప్పబడినది.

ఉదా:- కొందరు ఊరేగింపుగా వెళ్ళుచున్నారు. అందులో కొందరు గొడుగులు వేసుకొన్నవారును, కొందరు వేసుకొనినవారును యున్నారు. అయినప్పటికి గొడుగులు లేనివారును కూడా కలిపి గొడుగుల ఊరేగింపు వెళ్ళు చున్నదని చెప్పుచున్నాము. అటులనే కర్మఫలము ననుభవించునది జీవాత్మయే అయినప్పటికి సర్వ వ్యాపకుడైన పరమాత్మ అంతటా నిండి యున్నప్పటికి పరమాత్మను పొందుటకు (శ్రేష్ఠమైనస్థానము ఈ శరీరము లోని హృదయాకాశమనబడు బుద్ధి గుహయని చెప్పబడినది.)

ఏ యగ్ని యజ్ఞము చేయగోరువారికి (స్వర్గలోక ప్రాప్తికి) సేతువుగా (వంతెన) నున్నదో అట్టి నాచికేతాగ్నిని తెలిసికొనుటకు, చయన మొనర్చుటకు సమర్థులమైతిమి. భయరహితమైన సంసార సముద్రము యొక్క అవతలి ఒడ్డున చేరగోరు బ్రహ్మవేత్తలకు ఆశ్రయభూతమైన అక్షరమైన సూక్ష్మమైన ఏ పరబ్రహ్మకలదో ఆ పరబ్రహ్మనుకూడ తెలిసికొన గలిగితిమి.

[ఎవరైనా తన గమ్య స్థానము చేరుటకు రథముమొదలగు వాహనముల నుపయోగించుచున్నారో అటులనే పరమాత్మను పొందగోరువారు శరీరరూప రథము నెట్లు నుపయోగించుకొనవలయునో యమధర్మరాజు నచికేతునకు చెప్పుచున్నాడు. మరియు జీవాత్మ శరీర రూపరథమును

మోక్షమువైపునకు సంసారము వైపునకు గూడ నడుపగలడు. మోక్ష మార్గము వైపు ఎట్లు నడపవలెనో చెప్పబడుచున్నది.)

ఈ శరీరమే రధము. రధము నధిష్టించిన ప్రయాణీకుడు జీవుడు. నిశ్చయాత్మకమైన బుద్దిసారధి. సంకల్ప వికల్పాత్మక మైన మనస్సు పగ్గములు. శ్రోత్రాదింద్రియములు గుఱ్ఱములు. శబ్దాది విషయములు మార్గములుగా నున్నవి. శరీర- ఇంద్రియ, మనస్సులతో కూడిన జీవాత్మను భోక్త యని లేక సంసారియని, వివేక యుక్తులగు జ్ఞానులు చెప్పుచున్నారు. కేవలాత్మకు భోక్తృత్వములే నప్పటికి బుద్ధియను ఉపాధితో కూడిన ఆత్మకే (జీవాత్మ) భోక్తృత్వము చెప్పబడినది.బుద్ధియను ఉపాధి లేనపుడు ఈ ఆత్మకు భోక్తృత్వములేదు. ఒకవేళ జీవునకు భోక్తృత్వమే స్వాభావికమైన ఎడల మోక్షప్రాప్తియే లేక పోవును. రధ సంబంధమైన గుఱ్ఱములు ఏవిధముగా భూమిపైన నడచుచున్నవో అటులనే ఇంద్రియ రూప గుఱ్ఱములున్ను, శబ్దస్పర్శాదులును భూమిపై నడచుచున్నని. రధము పోవుటకు గమ్యస్థానముగా ఒక గ్రామమో, పట్టణమోయున్నట్లుగా శరీర రూప రధమునకు గమ్యస్థానము ఇంద్రియాదిరహిత శుద్ధాత్మయైయున్నది. అశ్వములను, పగ్గములను, తనస్వాధీనములోనుంచుకొన్న రధికుడు సులభముగా రధమును, గమ్యస్థానముచేర్చగలిగినట్లు బుద్ధిరూపసారధి వైరాగ్య రూపక వచనమును ధరించి మనోరూపమైన పగ్గములతో ఇంద్రియ రూప అశ్వములను వశపరచుకొని గమ్యస్థానమైన పరమాత్మను జేర్చుచున్నాడు.

గుఱ్ఱపు కళ్ళెములను దృఢముగా చేతిలో నుంచుకొన జాలని సారధి రధమును సరిగా గమ్యస్థానమును చేర్చజాలడు, రధమును మిట్ట

పల్లములలో పోనిచ్చి కష్టముల పాలగును. అటులనే మనస్సును స్వాధీనములో నుంచుకొనినవాని ఇంద్రియములు విషయములందు చిక్కబడి సుఖదుఃఖములనుభవించుచు, జననమరణ రూప సంసారమున మునిగి తేలుచుండును. ఇంద్రియాతీతమైన బ్రహ్మను పొందజాలరు.

పగ్గములను తన చేతిలో ధృఢముగా నుంచుకొను సారధి గుఱ్ఱములను తన వశమందుంచుకొని రధమును సక్రమ మార్గమున నడిపి సుఖముగా గమ్యస్థానము చేర్చునటులనే విజ్ఞానవంతుడు నిశ్చలమైన బుద్ధితో మనస్సును నిగ్రహించి, ఇంద్రియములను విషయాదుల నుండి మరలించి జనన మరణ రహిత గమ్యస్థానమైన పరమాత్మను చేర్చును. అతనికి పునర్జన్మలేదు.

స్థూలములైన ఇంద్రియములనుండి సూక్ష్మాతి సూక్ష్మమైన పరమాత్మను తెలిసికొను విధానము చెప్పబడు చున్నది,

ఇంద్రియములు గోళకములకన్న సూక్ష్మమయినవి. నేత్రము అనగానే మనకు కల్పించునది స్థూలమైన గోళకము నేత్రేంద్రియము నేత్రగోళకమునకు అంత రంగముగా సూక్ష్మంగా యున్నది. అటులనే ఇంద్రియములకన్న వానికి కారణమగు శబ్దాదితన్మాత్రలు సూక్షం శబ్దాది తన్మాత్రలకన్న మనస్సు సూక్ష్మం. మనస్సుకన్న బుద్ధి, బుద్ధికన్న మహత్తత్వము సూక్ష్మం మహత్తత్వం కన్న అవ్యక్తం సూక్ష్మం అవ్యక్తం కన్న పురుషుడు [పరమాత్మ] సూక్షం పురుషునికింటె సూక్ష్మమైనది మరియొకటిలేదు. అదియే అంతిమము, అదియే పరమావధి.

(పరబ్రహ్మంనుండి అవ్యక్తం, అవ్యక్తం నుండి మహత్తత్వం మహత్తత్వమునుండి అహంకారము. అహంకార తత్వమునుండి ఆకాశము, ఆకాశం నుండి వాయువు, వాయువు నుండి అగ్ని, అగ్ని నుండి జలం, జలం నుండి పృధివి, పృధివినుండి ఓషధులు ఓషధుల వలన అన్నము, అన్నము వలన సకల ప్రపంచము సృష్టింపబడెను. పంచభూతముల పంచీకరణమూలమున శ్రోత్రాదిగోళకంలేర్పడుచున్నవి. పంచభూతముల పరస్పర కలయిక వలన ఇంద్రియము లేర్పడుచున్నవి. కారణము సూక్ష్మంగాను కార్యం స్థూలంగాను వుండునుగదా! అవ్యక్తం ఇంద్రియంలకు గోచరం కానటువంటి సూక్ష్మత్వం పృధివి అన్నిటికన్న స్థూలత్వం స్థూల తత్వంలనుండి సూక్ష్మం సూక్ష్మతరం నుండి సూక్ష్మతమము నైన తత్వంలను గ్రహించునటుల చేయుటకే స్థూలారుంధతీ న్యాయమున ఈ విధంగా వర్ణింపబడినది. అష్టప్రకృతులతో కూడిన ఈ శరీరమునందు స్థూలములైన గోళకములనుండి ఒకదానికంటె ఒకటి సూక్ష్మమైన అవ్యక్తతత్వం వరకు విచారించుచు వెళ్ళినచో అష్టప్రకృతుల కావలనుండు ప్రత్యగాత్మను తెలిసికొను విధానం వర్ణింపబడినది.

మనకు కల్పించు శ్రోత్రము, త్వక్, చక్షువు, జిహ్వా, ఘ్రాణములు గోళకములుగాయున్నవి! ఈ గోళకములకు అంతరముగా ఇంద్రియములున్నవి. శ్రోత్రము శబ్దమును గ్రహించు పనిముట్టుగాయున్నది. శబ్దమును శ్రోత్రేంద్రియము మనస్సునకు చేర్చుచున్నది. (Aptic Nerve శ్రోత్రేంద్రియము చెడినచో గోళకముగాయున్న చెవి బాగుగాయున్నప్పటికి శబ్దమును గ్రహించుటలేదు, గోళకములకన్న ఇంద్రియములు

అంతరముగా యున్నవి. ఇంద్రియల కన్న శబ్దాది తన్మాత్రలు అంతరముగా యున్నవి, తన్మాత్రలకన్నా మనస్సు అంతరముగా వున్నది. మనస్సుకన్న బుద్ధి అంతరముగా యున్నది. బుద్ధికన్న మహత్తత్వము, దానికన్న అవ్యక్తము అంతరంగా యున్నవి. అవ్యక్తమునకు అంతరముగా ప్రత్యగాత్మ ఉన్నాడు. ప్రత్యగాత్మకన్న పరుడైనవాడు లేనందున అతడే పరాగతి అల అనబడుచున్నాడు. సర్వాంతర్యామి, సర్వ వ్యాపి యగు పరమాత్మను బుద్ధి గుహయందే సాక్షాత్కారము చేసుకొనవలెనని యింతకు పూర్వమే చెప్పబడినది. అట్టి సాక్షాత్కారము యీ విచారణ ద్వారా కలుగుచున్నది.

మరియు ఓ నచికేతా! ఈ ఇంద్రియములకు అంతరముగా ఆత్మ యున్న ఎడల అందరకు అనుభవములోనకి రావలయునుగదా; అట్లు అనుభవములోనికి రాకపోవుటకు కారణమేమని నీవు తలంపవచ్చును. వినుము ఈ పురుషుడు సకల ప్రాణులందుగూఢముగా అతిసూక్ష్మముగా యుండుట చేత అందరకు తెలియనట్లు ప్రకాశించుటలేదు, ఏకాగ్రత కలిగి సూక్ష్మమైన వస్తువులను పరిశీలించు అలవాటు కలిగిన సూక్ష్మ బుద్ధితో సూక్ష్మమైన వస్తువులను చూచుటకు సమర్ధత కలిగిన జ్ఞానులచే చూడబడుచున్నాడు, సామాన్యముగా మనస్సు ఇంద్రియములవైపు తిరిగియుండును. ఇంద్రియములు శబ్దాది విషయముల వైపు మరలు చుండును. కనుక మనస్సుకూడా ఇంద్రియములతో గూడి విషయాదులయందు సంచరించు చుండును. ఇట్టి మనస్సు విషయాసక్తమై, సుఖదుఃఖముల ననుభవించు చుండును. ఈ మనస్సు బాహ్యామైన స్థూల పదార్థములనే చూడగలదు. అంతరముగాయున్న అతి సూక్ష్మముగా యున్న ఆత్మను చూడలేదు. బుద్ధి

కూడా ఈ మనస్సునే అనుసరించుచుండును, మనస్సు ఇంద్రియములను విషయాదులమీదికి పోనీయక నిగ్రహించినపుడు స్థూల విషయములను వదలి సూక్ష్మ పదార్థపరిశోధనకు అనువుగా యుండును. అప్పుడు బుద్ది కూడా సూక్ష్మవస్తు పరిశోధనకు అనుకూలముగా యుండును. దీనిని అగ్ర్యమ బుద్ధి అందురు అట్టి సూక్ష్మబుద్ది కలవారే ఆత్మ దర్శనము చేసు కొనగలరు.

పరమాత్మను దర్శింపగోరువారు ముందు వాక్కును, అనగా కర్మేంద్రియములను జ్ఞానేంద్రియములను, విషయములందు పోనీయక వాటినుండి మరల్చి మనస్సునందు చేర్చవలెను. ఇంద్రియములు గోళక ముల ద్వారా బహిర్గతమై రూపాదులను గ్రహించుచున్నది. అట్లు గోళక ముల ద్వారా బయటకు వ్యాపించకుండా ఇంద్రియములు తమ స్వస్థాన ములో నుండునట్లు చూడవలెను. అచటనుండి వాటికి అంతరముగా యున్న మనస్సునందు చేర్చవలెను. అపుడు మనస్సుకూడా బహిర్ముఖము కాకుండా స్వస్థానములో యుండును. ఆ మనస్సును బుద్ధియందు చేర్చ వలెను. మనస్సు బాహ్యావిషయములనుండి మరలినపుడు బుద్ధికి స్థూల విషయములను నిశ్చయింప వలసిన అవసరము లేకపోవుటచేత ఏకాగ్రమై సూక్ష్మవస్తువులను పరిశీలించగలుగును. అట్టి బుద్దిని తనకంతరముగా నున్న మహత్తత్వమునందు జేర్చవలెను. ఆ మహత్తత్వమును ఆత్మయందు చేర్చవలెను. సాంఖ్య విచారణచే సాధకులకు యీ విధా నము చాలా ఉపయోగముగా యుండును.

యమధర్మరాజు పైన జెప్పిన మార్గమున పయనించి పరమాత్మను తెలిసికొనుటకు నచికేతుని ద్వారా మానవ జాతిని ఈ విధముగా మేల్కొ

లుపుచున్నాడు. ఓ మానవులారా। లెండు! అజ్ఞానమనెడి నిద్రనుండి మేల్కొనుడు, ఆత్మసాక్షాత్కారము పొందిన గురువర్యులనాశ్రయించి వారి ఉపదేశములను పొంది వారి ఆజ్ఞననుసరించి శ్రద్ధతో నిరంతరము అభ్యాసముచేసి ఆత్మను 'అయమస్మి' అని తెలిసికొనుడు. ఉపేక్షింపకుడు ఈ మార్గము పదునుగల కత్తి యొక్క అంచునంటిది. ఈ అంచుమీదుగా పాదమునుంచి నడచుట ఎంతకష్టమో పరమాత్మను తెలిసికొను మార్గము కూడా అంత కష్టమైనదని విద్వాంసులు చెప్పుచున్నారు.

(తెలిసికొనవలసిన ఆత్మతత్వము అతిసూక్ష్మమగుటచేత సద్గురువుల నాశ్రయించు వారి బోధలచేత అజ్ఞానమును పోగొట్టుకొని నిరంతర ప్రయత్నముచేత మనస్సును బాహ్య విషయములనుండి మరల్చి పరిశుద్ధమైన సూక్ష్మబుద్ధితో ఆత్మ సందర్శనమునకు ప్రయత్నించవలెను. బాహ్య విషయములందు ప్రవర్తించు మనస్సును ఆత్మాభిముఖము చేయుట ఎంత కష్టమో అసిధారావ్రతముతో పోల్చి చెప్పబడినది.)

శబ్ద, స్పర్శ, రూప, రస, గంధ గుణములుగల పృధివిస్థూలమైనది. శబ్ద, స్పర్శ, రూప, రసగుణములుగల జలము పృధివికన్న సూక్ష్మం శబ్ద, స్పర్శ, రూపగుణములుగల అగ్నిజలముకన్న సూక్ష్మము. శబ్ద, స్పర్శ, గుణములుగల వాయువు అగ్నికన్న సూక్ష్మము శబ్దగుణమేగల ఆకాశము వాయువుకన్న సూక్ష్మము. పంచభూతములు ఒక్కొక్క గుణము తగ్గిన కొలది సూక్ష్మమగుచున్నది. నిశ్శబ్దో బ్రహ్మ ఉచ్యతేవి యని చెప్పబడినటుల ఏ గుణములేని పరమాత్మ అతిసూక్ష్మము. ఈ విధముగా స్థూలమైన పృధివికంటె ఆకాశము సూక్ష్మమని గ్రహించ

గలుగుచున్నాము, అదేవిధముగా శబ్ద, స్పర్శ రూప, రస. గంధములను ఏ గుణములేని పరమాత్మ సూక్ష్మాతిసూక్ష్మమని గ్రహింపవచ్చునుగదా. అవ్యక్తము విత్తనము వంటిది. ఆ విత్తనము ఉబ్బినట్లుండునది మహత్తత్వము. దానినుండి బయటకు వచ్చిన మొలకవంటిది అహంకారతత్వము కాండము, కొమ్మలు. ఆకులు మొదలగునవి ఆకాశాది పంచభూతములుగా యున్నవి. మరియు ఇదికార్యకారణ రూపముగానున్నది. మరియు ఆద్యంతములు గలిగి యున్నవి. ఏ కారణములేని ఆత్మ ఆద్యంతములు లేనిదిగాను. అవ్యయము, నిత్యమునై యున్నది. శాశ్వతమైన ఇట్టి తత్వమును తెలిసికొన్నవారు ముక్తులగుదురు.

నచికేతుని మూలమున లభించినట్టియు, మృత్యుదేవతల వలన ఉపదేశింపబడినట్టియు, వైదికమగుటవలన సనాతనమైనట్టియు, గురుశిష్య సంవాద రూపముగా నున్నట్టియు. ఈఉపాఖ్యానమును యోగ్యులకు చెప్పిన వారున్ను, బ్రహ్మవిష్ణులగు గురువుల వలన ఉపదేశమును పొందిన వారున్ను. బ్రహ్మలోకమున పూజనీయులగుదురు.

ఎవరీ శ్రేష్ఠము, రహస్యమునైన నాచికేతోపాఖ్యానమును శుచియై బ్రహ్మజ్ఞానుల సభయందుగాని, శ్రాద్ధ కాలమందుగాని వినిపించుట అనంత ఫలకారియగును.

-: తృతీయవల్లి సమాప్తము :-

—: చతుర్థవల్లి ప్రారంభము :—

చతుర్థవల్లి :- నచికేతుడు తనలో తానిట్లనుకొనుచున్నాడు. సూక్ష్మబుద్ధితో సూక్ష్మాతి సూక్ష్మమైన ఈ ఆత్మను తెలిసికొనవచ్చునని ఇంతవరకు యమ ధర్మరాజు చెప్పియున్నాడు, ఆయన చెప్పినంత సులభముగా ఆత్మను అందరూ గుర్తించలేకున్నారు. అట్లు ఆత్మను గుర్తించకుండుటకు ప్రతి బంధకారణములేవైన యున్నవేమో తెలిసికొని తొలగించుకొనవచ్చును గదాయని తలంచుచుండగా అతని సంశయమును గ్రహించిన యమధర్మ రాజు ప్రతిబంధకారణములను ఈవిధముగా చెప్పుచున్నాడు.

నచికేతా! పరమేశ్వరుడు శ్రోత్రాది ఇంద్రియములను శబ్దాది బాహ్య విషయములను గ్రహించుటకే నిర్మించెను. కావున మానవుడు ఆ ఇంద్రియములద్వారా ప్రాకృతకములగు బాహ్య విషయములనే గ్రహించ గలుగుచున్నాడు, గాని అంతరాత్మను గ్రహించుటలేదు. ఇంద్రియములు బహిర్ముఖములై యుండుటచేత బాహ్య విషయములనే గ్రహించుట సహ జము అయినప్పటికిని ఉపాయశాలియు ధైర్యముకలవాడునగు మానవుడు ప్రవాహంనకెదురీదునటుల వివేకియగువాడు గొప్ప ప్రయత్నముచేత ఇం ద్రియ ప్రవృత్తిని నిరోధించి, వానిని అంతర్ముఖముగానుండునట్లుచేసి ప్రత్యగాత్మను చూచుచున్నాడు. దాని వలన జరామరణ రూప సంసారము నుండి విముక్తుడగును.

[మనస్సు ఇంద్రియములతో కూడినపుడే అవి వానివాని విషయములను గ్రహించగలుగును. లేనిచో ఇంద్రియములు విషయములను గ్రహించుటలేదు. ఆత్మ దర్శనము కావలయునని మనస్సు అంతర్ముఖము కావలయును. "(One Cannot serve two masters)" అన్నట్లు ఒక సేవకుడు ఇద్దరు యజమానులను సేవింపలేనట్లు మనస్సు అంతరముగా యున్న ఆత్మను. బాహ్యముగానున్న శబ్దాది విషయములను ఒకేసారి గ్రహించలేదు. శబ్దాది విషయములనుండి ఇంద్రియములను మరచ్చినగాని మనస్సు బాహ్యవిషయములనుండి మరలలేదు. ధ్యానశీలుడైన వ్యక్తి మాత్రమే ఇంద్రియములను నిగ్రహించి మనస్సును అంతర్ముఖము చేసుకొనగలడు. అద్దమును ప్రపంచము వైపు త్రిప్పినపుడు ప్రపంచమును చూపును. తనవైపు త్రిప్పుకొని తనముఖమును చూపించునటుల మనస్సు ఇంద్రియములతో కూడినపుడు ప్రపంచమును అంతర్ముఖమైనపుడు ప్రత్యగాత్మను చూపించును. గట్టి ప్రయత్నముచేత ఇంద్రియములను,మనస్సును అంతర్ముఖముగా వుండునట్లు చేయవలెను. అట్టివారికే మోక్షము)

అజ్ఞానులు బహిర్గతములైన కామ్య విషయములనే కోరుచున్నారు. అట్టివారు జన్మ, జరామరణ రోగాదులతోకూడి మృత్యుపాశమునకు గురియగుచున్నారు. కాని వివేకవంతులు అశాశ్వతమైన భోగములను కోరక శాశ్వతమైన మోక్షమునే కోరుదురు. మోక్షము 'నకర్మణావర్ధతేనో కనీయాన్' అను శ్రుతి ననుసరించు కర్మలచేత పెరుగుట కాని తరుగుట కానిలేదు, ఇదిధృవమైనది శాశ్వతమైనది. వివేకులు ఈ విధముగా తెలిసి దాని కురేషణ, ధనేషణ, పుత్రేషణలను ఈ షణాత్రయములను త్యజించి మోక్షాభిలాషులగుచున్నారు.

శ్రోత్రాదింద్రియములు జడములగుటచేత శబ్దాది విషయములను గ్రహించు శక్తి లేనివిగా యున్నవి. ఇంద్రియములకు అంతరముగా యున్నటువంటి, విజ్ఞానమే స్వభావముగాగల ఆత్మమాత్రమే అన్నిటిని తెలిసికొనుచున్నది. ఎట్లనగా ఆత్మతో కూడిన అంతఃకరణోవృత్తి బహిర్గతమై చక్షురింద్రియముల ద్వారా దశవిధరూపములను జిహ్వేంద్రియముల ద్వారా షడ్రసములను ఘ్రాణేంద్రియముద్వారా చతుర్విధగంధములను త్వగింద్రియము ద్వారా ద్వాదశ స్పర్శలను, శ్రోత్రము ద్వారా చతుర్విధ శబ్ధములను, అటులనే విషయానందమును తెలిసికొనుచున్నది. ఈ దేహములో ఆత్మ చైతన్యమున్నంతవరకే ఇంద్రియములు విషయములను గ్రహించుచున్నవి. ఆత్మచైతన్యము లేనప్పుడు, (మరణించినపుడు) ఇంద్రియములు వానివానిస్థానములలో ఉన్నప్పటికి విషయములను గ్రహించుటలేదు. కనుక అన్నిటిని తెలిసికొనునది ఆత్మయే. ఆత్మ తెలిసికొనుటకు శక్యముకాని వస్తువు ఏదియునులేదు. ధర్మాధర్మములకంటె భిన్నమైన ఏ ఆత్మ తత్వమును నీవెరుంగ కోరితివో దేవతలు సైతము దేని విషయమున సంశయ గ్రస్తులైరో అట్టి ఆత్మ తత్వమిదియేయని తెలిసికొనుము.

(ఇంతకుముందు ఇంద్రియములకు అంతరముగా మనస్సు మనస్సుకు అంతరముగా బుద్ధి, బుద్ధికి అంతరముగా ఆత్మయున్నటుల చెప్పబడినది. ఇప్పుడు ఆ యాత్మ అన్నిటికి అంతరముగాయుండి బుద్ధిమనస్సులతో కూడి, ఇంద్రియములద్వారా శబ్దాది విషయములను గ్రహించుచున్నటుల చెప్పబడినది. ఈ విధముగా ఆత్మయునికి ధృఢముగాను స్పష్టము

గాను చెప్పబడినది. అయినప్పటికి ఆ విద్యతో కూడిన అల్పజ్ఞానులయి ఆత్మను తెలియలేకున్నారు,)

జాగ్రత, సప్నసుషుప్తి అవస్థలను అంతర నిత్యము అనుభవించు చున్నారు.గదా! జాగ్రధవస్థలో సర్వవ్యవహారణ్ణులు చేయుచున్నారు. స్వప్నావస్థలో అనేక కలలు కనుచున్నారు. సుషుప్తిలో ఈ రెండవస్థ లలోని వ్యవహారములులేక, ఏ బాధయు లేక సుఖముగానిద్రించుచున్నారు, ఈ అవస్థలన్నియు గుర్తించునది ఆత్మయే.కాలత్రయమందున్నట్టి ఆత్మను గొప్పదానిగను, సర్వ వ్యాప్తిగను తెలిసికొన్న ధిరులు శోకింపరు, జాగ్ర ధాది అవస్థలు, వ్యవహారములు దేహమునను సరించి జరుగుచున్నవి. దాని ననుసరించి దుఃఖము కల్గుచున్నది. వ్యవహార రహితమైన ఆత్మ దేనిని గురించి శోకించును! అనగా అత్మ శోకరహితం. అట్లు తెలిసికొన్నవారు శోక రహితులు.

బుద్ధి అహంకారముతో కూడిన ఆత్మ చైతన్యము 'అహంకర్తా అహం భోక్తా' నేను కర్తను, నేను భోక్తను అని వ్యవహరించుచున్నది. అట్టి జీవునిబుద్ధి, అహంకారము అను ఉపాధిమండి వేరుపరచినచో కాల త్రయని యామకుడగు ఈశ్వరుడే అగుచున్నాడు. ఈ విధముగా తెలిసిన వారు తనను ఇతరులనుండి రక్షించుకొనగోరరు.

మరియు తపస్సులన్నిటికంటెను, జలము మొదలగు పంచభూత ముల ఉత్పత్తి కంటెను, పూర్వమే ఏది యున్నదో అది బుద్ధిరూప

హృదయాకాశమును ప్రవేశించి భూతములతో కూడ ప్రకాశించుచున్నది దానిని జ్ఞాలులు చూతురు. అదే ఇది. నీ వడిగిన అత్మ తత్వమిదియే.

(కల్పాంతమందు ప్రళయమగును. అట్టి ప్రళయ సమయమున భూతములన్నియు లయమై అవ్యక్తమే మిగిరియుండును. జీవులుకూడా తమతమకర్మవాసనలతోగూడి సూక్ష్మ శరీరముతో అవ్యక్తమందే నిలచియుందురు. మరల సృష్టి ప్రారంభ సమయమున ఆకాశాది పంచభూతములకంటె ముందుగా హిరణ్యగర్భుడు జన్మించును. అతడే దేవాది సకల శరీరములను సృజించెను. ఆ శరీరములందు జీవునితోపాటుపరమాత్మయు అంతర్యామి రూపమున నివసించును. అట్టి పరమాత్మను జ్ఞానులు మాత్రమే చూచుచున్నారు. మరియు ప్రాణ స్వరూప హిరణ్యగర్భుడు స్థూల ప్రపంచమందలి శబ్దాది విషయరూప అన్నమును భుజించుటచేత అదితి యని చెప్పబడుచున్నాడు. ఇంద్రాది దివతా స్వరూపముగా నుండుటచేత సర్వదేవతామయుడనబడుచున్నాడు. వ్యష్టిప్రాణులందు తాదాత్మ్యము నొందుటవలన సర్వభూతమయుడుగానున్నాడు, అట్టి హిరణ్యగర్భుడు ఏ పరమాత్మను ధ్యానించుచున్నాడో, అటులనే నీవును నీ బుద్ధి గుహాలయందు ప్రవేశించినట్టి పరమాత్మను ధ్యానాదులతో తెలిసికొనుము.

హిరణ్యగర్భునిచే సృజింపబడిన విరాట్పురుషుని శాస్త్రము అగ్ని రూపమున వర్ణించుచున్నది. గర్భిణీస్త్రీలు తమ గర్భమందున్న శిశువునకు ఎటువంటి అపాయము కలుగకుండుటకై శుచియైన ఆహారము తీసుకొని కాపాడుచున్నారో అటులనే అధియజ్ఞుడగు విరాడ్రూప అగ్నినిపై అరణి క్రింది అరణి అను రెండు అరణులయందు ఋత్విక్కులు కాపాడుచున్నారు. అధ్యాత్ముడగు జఠరాగ్నిని యోగులు మితాహారముచే కాపాడు

చున్నారు. అట్టి అధియజ్ఞాగ్నిని జాగరణశీలురైన ఋత్విక్కులు, ప్రతి నిత్యము కాపాడుచున్నారు. విరాడ్రూపముననున్న ఈయగ్నియుపరబ్రహ్మమే. ఇదియే నీవడిగిన తత్వము.

(అగ్ని కట్టెలయందు గూఢముగా వ్యాపించి యున్నటుల పరమాత్మ అంతటను వ్యాపించియున్నాడు. కట్టెలను మధించుటచేత అగ్ని బయల్పడునట్లు ప్రాణాయామాది అభ్యాసములచేత చిత్తైకాగ్రతను పొంది, అట్టి ఏకాగ్రత చిత్తంతో ధ్యానమను మథనము ద్వారా పరమాత్మ సాక్షాత్కారమగును,)

ప్రాణరూప హిరణ్యగర్భుడున్ను, అగ్నిరూప విరాట్టున్ను పరబ్రహ్మమేయని చెప్పగా నచికేతుడు, ఓ యమధర్మరాజా! హిరణ్యగర్భరూపముచేతను విరాడ్రూపముచేతను అపరబ్రహ్మమును ఏల ఉపదేశించెదవు. సాక్షాత్ పరబ్రహ్మమునే నాకు ఉపదేశింపుమనెను. అంతట యమధర్మరాజు ఓ నచికేతా: ఆ పరబ్రహ్మము మనోవాక్కులకు అతీతముగా యున్నది. రూపము' గుణముగలవానినే శబ్దము బోధించగలుగుచున్నది. రూపరహితమైనటువంటి, గుణరహితమైనటువంటి పరబ్రహ్మను బోధించుటకు శబ్దము సమర్ధముకాదు. అందుచే విశేషములతో కూడిన హిరణ్యగర్భ విరాడాది రూపములద్వారా, నిర్గుణ పరబ్రహ్మముయొక్క వాస్తవ రూపమును నీవు తెలిసికొనుమనెను. నచికేతా! ఎవనినుండి సూర్యుడుదయించుచున్నాడో, ఎవనియందు అస్తమించుచున్నాడో ఎవని నతిక్రమించుటకు దేవతలుకూడా సమర్ధులు కారో అతనిని బ్రహ్మమని తెలిసికొనుము. ఇచట ఏది కలదో అచటను అదియే కలదు. అచట ఏది కలదో ఇచటను

అదియేకలదు. ఎవరు ఈ విషయమున అనేకముగా చూచుచున్నారో వారు మరల జనన మరణ రూప సంసారమును పొందుచున్నారు.

(నీ శరీరమందును, నా శరీరమందును అన్యశరీరములయందును, ఏచైతన్యము సాక్షిరూపముగా నున్నదో ఆ చైతన్యమే విరాట్‌శరీరమందును. సాక్షిరూపముగా యున్నది. ఇచట వ్యష్టిస్థూలసూక్ష్మకారణ దేహములందు ఏ ప్రత్యగాత్మ విశ్వతైజస ప్రాజ్ఞరూపముగా నున్నదో అచట సమిష్టి స్థూలసూక్ష్మ కారణ దేహములందు ఏ పరమాత్మ, విరాట్ హిరణ్యగర్భ అవ్యాకృత రూపముగా యున్నదో, అదియు, ఇదియు ఒకటే. అనగాపరబ్రహ్మమే భేదములేదు. అఖండాకాశమునందు భేదములేనప్పటికి ఘటము, మఠము మొదలగు ఉపాధులచేత భేదము పొందినట్లు కన్పించుచున్నట్లుగా ఈ అఖండచైతన్యము ఉపాధులమూలముగా భేదము పొందినట్లు కన్పించుచున్నది. వాస్తమున భేదములేకపోయినప్పటికి ఈ లోకమందు అజ్ఞానులు ఆత్మధర్మమును అనాత్మయగు శరీరధర్మములందు చూచి ఆత్మను అనేకముగా తలంచుచున్నారు. ఎవరు ఈవిధంగా ఆత్మను అనేకముగా చూచుచున్నారో, వారుమృత్యువునుండి మృత్యువును పొందుచున్నారు. సర్వభేదరహితమైనటువంటి అద్వితీయ బ్రహ్మనెరిగినవారు, అమృతత్వమును పొందుచున్నారు.)

నచికేతా! అట్టి బ్రహ్మను తెలియుటకు సదాచార్యులు ఉపదేశము వలన మనస్సును సంస్కరింప వలయును, యమని యమాదులచేత బుద్ధిని శుద్ధమొనర్చవలయును. అట్టి శుద్ధబుద్ధిచేతనే ఏకరసమైన ఈ బ్రహ్మము తెలియదగినది అన్యమార్గములేదు' బ్రహ్మమొక్కటే వస్తువమనియు, దానికి వ్యతిరేకముగా నేదియులేదని ధృడనిశ్చయము చేయవలెను.

అట్టి నిశ్చయమువలన అవిద్య నశించును. బ్రహమ్మ ఏకమను నిశ్చయములేని వారికి అవిద్యానానాత్వబుద్దిని కల్గించును, నానాత్వ బుద్ధి కలవారు మాటిమాటికి జనన మరణములను పొందుచున్నారు.

నచికేతా! ఆ పరమాత్మ అందరి శరీరముల మధ్యభాగమందుంటు న్నాడు. అంగుష్ఠమాత్ర హృదయాకాశమున వుంటున్నాడు, అంతట నిండి యుండుటచేత పురుషుడని చెప్పబడుచున్నాడు. ఈ పురుషుడే కాలత్రయ మునకు నియామకుడు. ఈ విధముగా తెలిసినవారు అట్టి పురుషునినుండి తనకు భయముకల్గునని తలంపడు. వానినుండి రక్షణను కోరడు.

(ధ్యానశీలుడైన వ్యక్తి తన హృదయాకాశమునందే పరమాత్మ సాక్షాత్కారము నొందును, స్వచ్ఛమైన అద్దమునందు ముఖము నిర్మలము గా కన్పించునట్లు శుద్ధాంతఃకరణమందు పరమాత్మ సాక్షాత్కారము లభిం చును.)

అంగుష్ఠమాత్రస్థానమున పొందదగు ఈ పురుషుడు ధూమములేని జ్యోతివలె ప్రకాశించుచున్నాడు. ఏపురుషుడు హృదయాకాశవర్తి అనియు కాలత్రయ నియామకుడనియు యోగీశ్వరులచేతను, గురూపదేశముచేతను రక్షింపబడుచున్నాడో ఆ పురుషుడు నిత్యుడు, కూటస్థుడు, మరియు ఈ కాలమందున్న ప్రాణులందున్నవాడును. రాబోవు కాలమందుండు ప్రాణు లందుండబోవువాడును. ఆ పురుషుడే అతనితో సమానుడు మరియొకడు లేడు,

పర్వతాదులందు వర్షించిన జలము పల్లపు ప్రదేశములలో ప్రవహ

వించి అనేకవిధ జలములుగా తెలియబడుచున్నది, అట్లేపరబ్రహ్మ ఒక్క
టే అయినను ఆత్మకంటె భిన్నమైన ధర్మములు ప్రతి శరీరమునందును
భిన్నభిన్నములుగా యున్నట్లు తోచుచున్నది. అట్లు భిన్నముగా చూచువారు
మాటిమాటికి శరీరములను పొందుచున్నారు.

పరిశుద్ధమైన జలమునందు పరిశుద్ధమైన జలమునుపోసిన ఆజలము
పరిశుద్ధముగానె యుండును. పరిశుద్ధ జలమును అపరిశుద్ధ జలమునందు
పోసిన యివికూడా అపరిశుద్ధములగును అటులనేమననశీలుడగు జ్ఞానమైన
వానిఆత్మ (జివాత్మ) పరమాత్మను పొంది శుద్ధముగానె యుండును.
స్వచ్ఛమైనజలము స్వచ్ఛమైన జలముతో కలసి ఏకముగా నుండునట్లు
జీవాత్మ పరమాత్మయందు చేరి ఏకముగానుండును. ఇంద్రియే ఆత్మస్థితి

—: చతుర్ధవల్లి సమాప్తము :—

## పంచమవల్లి ప్రారంభము

పంచమవల్లి :- నచికేతా। శరీరమున్నపుడే జీవునకు దుఃఖము కలుగు
చున్నది. స్థూల సూక్ష్మ కారణశరీరములలో కారణశరీరము దుఃఖమునకు
సాక్షాత్కారముకాదు. సాక్షాత్కారమైనపుడు సుషుప్తియుండును. దుఃఖము
కలుగవలసి యున్నది. సుషుప్తిలో అట్టి దుఃఖము కలుగుటలేదు. విత్త
నము మొలకద్వారా ఫలమునకు కారణమైనట్లు కారణ శరీరము, స్థూల

సూక్ష్మ శరీరములద్వారానే దుఃఖమునకు కారణమగుచున్నది. సూక్ష్మ శరీరము కూడా స్థూలశరీరముద్వారానే జీవులకు భోగ ప్రాప్తిచేయుచున్నది. ఆ స్థూల శరీరమును శాస్త్రము పురమని చెప్పుచున్నది. అన్నపానాదుల భక్షణచే కలుగు రసము త్వగాది సప్తధాతువులను వృద్ధిచేయుటచేత స్థూల శరీరము పూర్ణతను పొందుచున్నది. అందుచే స్థూల శరీరము పూర్ణతను పొందుచున్నది. అందుచే స్థూలశరీరము పురమని చెప్పబడుచున్నది.

మరియు పట్టణమును కూడా పురమందురు కదా! అట్టి పురమునకు ద్వారములు, ద్వారపాలకులు, పురపాలకుడు, ఉండునటులనే శరీరరూప పురమునకు ఏకాదశ ద్వారములున్నవి. నేత్రద్వారములు రెండు, శ్రోత్రద్వారములు రెండు, నాసికా ద్వారంబు రెండు ముఖద్వారం ఒకటి నాభిగుదము ఉపస్థయ మూడు. బ్రహ్మరంధ్ర మొకటి మొత్తము పదకొండు ద్వారలు మువీని అధిష్టాన దేవతలే ద్వారపాలకులు. ఈ ద్వారములతో కూడిన ఈ పురము పురధర్మ విలక్షణుడైన ఆత్మకు సంబంధించినది. ఈ ఆత్మ అనగా జీవాత్మ పరమాత్మను సమ్యక్ జ్ఞాన పూర్వకముగా ధ్యానించి ఆ పరమాత్మ అన్ని భూతములయందు సమముగా వుండు వాడని తలంచి శోకింపడు జ్ఞానముచే అవిద్య నశించుటచేత కామ్యకర్మ బంధములచే విముక్తుడై మరల శరీరమును బొందడు. అనగా మోక్షము పొందుమ.

ఆత్మ మానవశరీరమందు మాత్రమే యుండునా లేక మానవేతర శరీరమునందుకూడాయుండు నా అను సందేహ నివృత్తికై ఆత్మ ఏ ఏ ఉపాధులలో ఏఏ విధముగా యున్నది. యమధర్మరాజు నచికేతునకు వివ

రించుచున్నాడు, ఇచట ఆత్మహంస స్వరూపముగా వర్ణింపబడినది. ఒక శరీరమునుండి మరియొక శరీరము పొందుటచేత హంసయని పిలువబడినది. యజుర్వేదములో కూడా ఈ విధముగానే యున్నది.

నచికేతా! హంస నిర్మలమైన ఆకాశమునందు సూర్యరూపము అంతటా నివసించువాడుగను. అనగా వస్తువుగను అంతరిక్షమున వాయు రూపమునను యజ్ఞవేదికయందు. లేక భూమియందు అగ్నిరూపముగను, ఇంటియందు అతిధిరూపమున యున్నది. మరియు మానవులందును. దేవతలందును అంతర్యామి రూపమునను్నది. ఆకాశమునంతటా వ్యాపించి యున్నది. అటులనే జలమునందు బుట్టిన శంఖ, శుక్తి, మకరాది రూపమునను భూమియందు పెరిగిన వ్రీహి, యవాదులు, తృణధాన్యముల రూపమునను పర్వతములందు పుట్టిననదుల రూపమునను యున్నది. ఇట్లు సర్వాత్మకుడగుటచేత అది సత్యమైయున్నది. సర్వకారణుడగుట చేత బృహత్తని. అన్నిటికన్న గొప్పదని చెప్పబడుచున్నది, ఈ విధముగా పిపీలికాది బ్రహ్మపర్యంతము సర్వాంగత్తునందు వ్యాపించి ఆత్మ ఒక్కటే యున్నది. జీవులు తమతమ కర్మానుసారము, ఉత్తమ, నీచ. శరీరములను పొందుచున్నారు, ఆత్మదేహమందున్నటుల గుర్తించుటకు మరియొక ఉదాహరణము చెప్పబడుచున్నది,

ఏది ప్రాణవాయువును పై భాగమునకును అపానవాయువును క్రిందభాగమునకు, పోవునట్లు చేయుచున్నదో అట్టి ఆత్మ హృదయాకాశమునందున్నది. అందరిచేతను సేవింపదగిన ఆ యాత్మను దేవతలు కూడా సేవించుచున్నారు,

(విజ్ఞానశాస్త్రము Respiratory centre యొక్క Oction మూలమున, శ్వాసక్రియ జరుగునటుల చెప్పుచున్నది.కాని అదికూడాఆత్మ శరీరమందున్నంతవరకే జరుగుచున్నది. ఆత్మశరీరమును విడిచి నపుడు శ్వాసక్రియ జరుగుటలేదుకదా మరియు సమాన, వ్యాన, ఉదాన, ప్రాణ అపానములనెడు పంచప్రాణములు శరీరములందు వాటి కార్యములైన ప్రాణవాయువుహృదయమునందుండి శ్వాసక్రియను అపానవాయువు గుద స్థానముననుండి మలమూత్రాది విసర్జనను సమాన వాయువు నాభిస్థానమున నుండి పచనమునుఉదానవాయువు కంఠస్థానమున నుండి శబ్దములనుపలికిం చుటను వ్యానవాయువు శరీరమంతటను వ్యాపించి అన్నరసమును శరీరమంతటా వ్యాపింపజేయుటయును క్రియకు చేయుటకు ఆత్మఉనికియే కారణముగా నున్నది.)

నచికేతా ; ఈ దేహము నాశ్రయించియున్న ఆత్మ ఈ దేహమును విడిచిపోయిన తరువాత ఇచట ఏమి మిగిలియుండును? ఏమియు మిగిలి యుండదు, ఒకపట్టణమును పరిపాలించు రాజును శత్రువులు ముట్టడింపగా రాజుపట్టణమును వదలి పారిపోయినపుడు పట్టణవాసులుకూడా ఏవిధముగా పట్టణమును వదలిపెట్టి పోవుచున్నారో అదే విధముగా శరీరరూప పట్టణ మును దాని కధిపతియగు ఆత్మశరీరమును వదలిపెట్టినచో శరీరములోని ఇంద్రియముల కార్యకలాపమంతయు ఆగిపోవుచున్నది, కనుక శరీరేంద్రి యములకన్న ఆత్మ వేరని తెలియుచున్నది. నచికేతా; ఎవరైనను చనిపో యినపుడు దాని ప్రాణముపోయినదని మామూలుగా వ్యవహరించుచు న్నారు. శ్వాస ఆగినపుడే ప్రాణముపోయినదని తలంతురు. కనుక జీవించి

యుండుటకు ప్రాణవాయువే కారణముగాని ఆత్మతోపని ఏమని తలంప వచ్చును కాని ఆత్మదేహమందున్నప్పుడే ప్రాణవాయువు సంచారము జరుగు చున్నది. ఆత్మదేహమును విడిచినపుడు మనము ఎంత వాయువును లోపలకు పంపినప్పటికిని చనిపోయినవ్యక్తి మరల జీవించుటలేదు. అందు చేత మానవుడు జీవించియుండుటకు ప్రాణవాయువే కారణముకాదు. అదే విధముగా అపానవాయువుగాని చక్షురాది ఇంద్రియములుకాని, కారణము కాదు. ఈ ప్రాణా పానాదులు దేని నాశ్రయించియున్నవో అట్టి ఆత్మయు నికి వలననే మనుష్యులు జీవించియున్నారు. గొడ్డలిగాని, కత్తిగాని, తనంతతానుగా దేనిని నరుకలేదుగదా! దానిని పట్టుకొన్నవ్యక్తి దానినుప యోగించి నరుకగలుగుచున్నాడు. అనగా ఒక వస్తును ఆశ్రయించినపుడే ప్రాణాపానాదులు, చక్షురాది దింద్రియములు పనిచేయుచున్నవి. స్వతహాగా ఏమి చేయుటలేదు.

(శిశువు పుట్టగానే ఏడ్చుచున్నది. అట్లు ఏడువని శిశువును ఏడ్పిం చుటకు ప్రయత్నించుచున్నారు, ఏడవనిచో ప్రాణవాయువును లోపలకు పంపు ప్రయత్నము చేయుచున్నారు. (Artificialres piration) శిశువు తల్లి గర్భములో నుండగా తల్లియొక్క రక్తముద్వారా ప్రాణవాయువు శిశువునకందుచున్నది.. శ్వాసకోశములు పనిచేయవలసిన అవసరములేదు. శిశువుపుట్టగానే తల్లినుండివేరుపడుచున్నది. తల్లినుండి వేరుపడుటచేత ప్రాణవాయువును బయటనుండి తీసుకొనవలసి వచ్చుచున్నది.

Almost the first thing the newborn child does is to breath, usually to cry, there by establishing the pulmonary method of respiration (By expandiny lungs) The reason for this is believed to be that during intrauterine

life the faetal blood which receives oxygen from the maternal blood through the placenta is kept in such a state the $Co_2$ tension is not enaugh to stimulate the developing respir.tory centre in the medulla. During the process of birth the oxygen content of the Maternal blood is diminished and the $Co_2$ content is increased It-stimulates the respiratory centre and pulmonary respiratory oction is exited Then the Child begins to breath. (Jahnstone's Midurifery)

పుట్టగానే శిశువు కేర్ కేర్ మని ఏడ్చిననేగాని ప్రాణవాయువును లోపలకు తీసుకొను పరిస్థితులేర్పడుటలేదు. ఏడ్పునందువలన శ్వాసకోశములు విస్తృతమై వాయువు ప్రవేశించుటకు అవకాశ మేర్పడును. అందుచేత ఏడ్చిన తరువాతనే ఉచ్ఛ్వాస నిశ్వాసములు జరుగుచున్నవి. హంస దేహమందున్నప్పుడు (Respiratory centre పనిచేయుటకు) ప్రాణవాయువు సంచారము జరుగుటకు వీలగు చున్నది. పుట్టిన శిశువు శరీరమునందు హంసలేని ఎడల ఎంత ప్రాణవాయువును లోపలకు పంపినను కృత్రిమ శ్వాసక్రియ జరిపినను, ప్రయోజనముండుటలేదు. హంసఉన్నపుడు కృత్రిమ శ్వాస క్రియవలన ప్రయోజనము కన్పించుచున్నది. శిశువు పుట్టినపుడు ఈ విషయములను గమనింప వచ్చును.

ఒక యజమాని ఒక ఇంటిలో నివసించినంతవరకు ఆ ఇల్లుబాగుగానే యుండును, యజమాని ఆ ఇంటిని విడిచినచో అది శిథిలమగుచున్నది. అటులనే హంస శరీరములో యున్నంతవరకు ప్రాణాదులు, ఇంద్రియములు, సక్రమముగా పనిచేయుచున్నవి. హంస శరీరమును విడి

చినచో అది క్రుళ్ళి నశించ పోవుచున్నది కనుక ఆత్మ శరీర, ఇంద్రియ ప్రాణాదులకన్న వేరుగా యున్నటుల స్పష్టమగుచున్నదికదా!

ఈ విధముగా ఆత్మ దేహముకన్న భిన్నమని అనేక ప్రకారములుగా నిరూపించి యమధర్మరాజు నచికేతుడడిగిన మరణానంతరము ఆత్మయొక్క స్థితిని గురించి ఈ విధంగా తెలియజేయుచున్నాడు.

నచికేతా; సనాతనమును, అతిరహస్యమునగు బ్రహ్మమును తెలియక మరణించువారికి కలుగు గతులను గురించి నీకు చెప్పెదను వినుము మానవులు జన్మించియు బ్రహ్మమును తెలిసికొనక అనేక ఫలములను గోరుచు అట్టి ఫలములను పొందుటకు అనేకవిధ కర్మల నొనరించి మరణించువారు మరణానంతరము ఆయా కర్మఫలమనుభవించుటకు తగిన శరీరమును పొందుటకు తగిన మాతృగర్భమున పుట్టుచున్నారు. కొందరు మానవులుగను, కొందరు పశుపక్ష్యాదులుగను, కొంధరు వృక్షాది స్థావరములుగను పుట్టుచున్నారు. నచికేతాస్థూలసూక్ష్మకారణములను మూడుదేహములున్నటుల ఇదివరకే చెప్పియున్నానుగదా! ఇందుకారణదేహము అవిద్యవలన కలిగినది. దాని కార్యము సూక్ష్మ దేహము కారణదేహము దుఃఖముననుభవించుటకు సాక్షాత్కారణముకాదు. సూక్ష్మదేహముకూడా స్థూలదేహముద్వారానే సుఖదుఃఖముల ననుభవించుచున్నది, స్థూలదేహమే కర్మలచేయుటకు, వాటిఫలమనుభవించుటకు తగియున్నది. కాని ఈదేహముతో చేసిన కర్మను ఆదేహముతోనే అనుభవించుటలేదు. అంతకు ముందు చేసిన కర్మను ఈదేహముద్వారా ప్రారబ్ధ రూపముగా అనుభవించుచున్నాడు. ఇంకనుసంచిత రూపకర్మ మిగులుచున్నది. మరియు కొత్తగా ఆగామి కర్మను చేయుచున్నాడు. ఈ విధముగా మిగిలిన కర్మ

లను అనుభవించుటకు మరియొక స్థూలదేహమవసరమగుచున్నది. మరణించినపుడు స్థూలదేహమే నశించుచున్నది. సూక్ష్మకారణదేహములు నశించుటలేదు, అవిద్య నశించినపుడు మాత్రమే ఈ రెండును నశించును. వీటితో కూడిన ఆత్మ చైతన్యమే జీవుడుగా యున్నది. ఎచటనో దూరముగా యున్నపుష్పముయొక్క వాసనను స్థూలరూపముగాయున్న పుష్పము నచటనే విడచి సూక్ష్మరూపముగా యున్నవాయువు తనతోపాటు తీసుకొని వచ్చినట్లుగా జీవుడు స్థూలదేహమును విడచి కర్మనుమాత్రము సూక్ష్మకారణ దేహములతోపాటు తనవెంటతీసుకొని వెళ్ళుచున్నాడు. మరియొక జన్మను పొందుచున్నాడు. జన్మాంతరమందు అనేక పుణ్య పాప కర్మలను చేయుచున్నాడు. పుణ్యకర్మలధికమైనపుడు దేవశరీరమును, పుణ్య పాపకర్మలు సమానముగా నున్నవుడు మానవశరీరమును పుణ్యకర్మ తగ్గి పాపకర్మ అధికమైన కొలది పశుపక్షి క్రిమికీటకాదుల శరీరమును వృక్షములు శిలలు మొదలగు స్థావర శరీరములను పొందుచున్నాడు. ఇట్లనేక జన్మల సంబధమైన కర్మజ్ఞాన సంస్కారములే భావి జన్మలకు కారణమగుచున్నవి. అధికపుణ్యముచే కలుగు శరీరమందు పుణ్యవాసనయు, అధికపాపముచే కలుగు శరీరమందు పాపవాసనయు కలుగుచున్నది. బ్రహ్మ ముమొదలుకొని వృక్షాది స్థావర పర్యంతంగల ప్రపంచమంతయు వారివారి పుణ్యాపాపకర్మలచేతనే పుట్టినది. కనుక ఆత్మ పుట్టి నశించుటలేదనియు శరీరమే పుట్టి నశించుచున్నదని స్పష్టమగుచున్నది. ఈ విధముగా కర్మలననుసరించియేగాక ఆయా జన్మలలో సంపాదించిన ఆత్మజ్ఞానములనుసరించికూడా ఉత్తమ జన్మలను పొందుచున్నాడు, జ్ఞాలసముపార్జనలో ఆత్మసాక్షాత్కారము పొందినవారు. మరియొక జన్మలో జ్ఞానపరిపూర్తి కొరకు ఉత్తమ దేహమును పొందుచున్నారు.

నచికేతా; స్వప్నావస్థయందు అంతఃకరణముకాక తక్కిన ఇంద్రియములన్నియు తమ తమ కార్యములను నిర్వర్తించుటలేదు అనగా శ్రోత్రాంద్రియములు శబ్దాది విషయములను గ్రహించుటలేదు. ఇవి యన్నియు నిద్రించుచున్నవి, ఆత్మ నిద్రించుటలేదు, జాగ్రదావస్థయందువలెనే స్వప్నమందును స్త్రీ పుత్ర, గృహారామక్షేత్రాదులను అంతఃకరణమందు సృష్టించుచున్నాడు. సుషుప్తియందు అంతఃకరణముతో కూడా ఇంద్రియములన్ని నిద్రించుచున్నవి. అయినప్పటికి సుషుప్తి యందును ఆత్మ సాక్షిరూపగా నుండుటచేత సుషుప్తియందలి శూన్యమును గుర్తించుచున్నాడు. ఈ విధముగా ఆత్మ సాక్షిరూపముగా యుండుటచేత మూడవస్థలను గుర్తించుచున్నది. కాని ఆత్మ మేల్కొనుట, స్వప్నమును పొందుట, సుషుప్తిని పొందుటయును' అవస్థలను పొందుటలేదు. ఆత్మసాంనిధ్యములో ఈ మూడవస్థలు జరుగుచున్నవి.

గదిలోయున్న దీపపు కాంతిలో ఒకరు చదువుకొనుచున్నారు, ఒకరిద్దరు వ్రాసుకొనుచున్నారు. మరియొకరు నిద్రించుచున్నారు, వారి వారి పనులతో దీపమునకు సంబంధములేనప్పటికి ఆయా పనులను ప్రకాశింపజేయనట్లుగానే ఆత్మ మూడవస్థలను పొందకుండగనే, ఆయవస్థలను ప్రకాశింపజేయుచున్నది,

ఆయాత్మశుద్ధ స్వరూపుడైయున్నాడు. అతడే అద్వితీయ పరబ్రహ్మ స్వరూపుడైయున్నాడు. అతడే సర్వ శాస్త్రములుచేతచెప్పబడినటువంటి అమృత రూపుడుగాయున్నాడు. సకల ప్రపంచము ఆ బ్రహ్మమునందే ఆధారపడియున్నవి. దాని నతిక్రమించునదేదియులేదు, ఇదియే నీ వడిగిన తత్వము.

ఈ విధముగా యమధర్మరాజు బ్రహ్మమును నిరూపించి సంశయ చిత్తులగు వారి సంశయమును పోగొట్టి ఆత్మజ్ఞానము స్థిరపడు నిమిత్తము మరల ఈ విధముగా బోధించుచున్నాడు.

నచికేతా! అగ్ని కాల్చబడు కట్టెలు మొదలగు వస్తువులకన్నా విలక్షణముగా యున్నప్పటికి అగ్ని వాటియందు ప్రవేశించి ఆ కట్టెలు పొడుగు. పొట్టి, గుండ్రము, మొదలగు ఏ ఆకారముతో యున్నవో ఆ యాకారములను పొందుచున్నది, పొడువుగాయున్న కట్టెను కాల్చునపుడు, పొడుగుగాను. పొట్టిగా యున్నదానిని కాల్చునపుడు పొట్టిగాను, చక్రమును కాల్చునపుడు గుండ్రముగా యున్నటుల కన్పించుచున్నది, కాని అగ్నికి పొడుగు పొట్టి రూపములులేవు. విద్యుచ్ఛక్తి ఒకటె అయినను, బల్బుతోచేరి ప్రకాశమును, ఫాన్‌తోచేరిగాలిని, రిఫ్రిజరేటర్‌తోజేరి చల్లదనమును హీటరుతోచేరి వేడిని, రేడియోతోచేరి శబ్దమును, ఆయా వస్తులనుబట్టి, అనేకముగా యున్నటులతోచినట్లు ఒక్కడేయైన ఆత్మసర్వ భూతములకు, సర్వదేహములకు విలక్షణుడయ్యును అతిసూక్ష్మ రూపమున అంతర్యామియై ఆయాశరీరములలో ప్రవేశించి ఆయా శరీరమునకు తగిన రూపమును అనగా దేవ, మానవ, పశు, పక్షిక్రిమి, కీటకాది శరీరరూపము కలవాడుగా కన్పించుచున్నాడు. శరీరములలోపలనే కాక వెలుపల, విశ్వమంతటను ప్రకాశించుచున్నాడు.

మరియు వాయువు ఒక్కటే అయినను ఆయా వస్తువులలోచేరి ఆ యారూపములను పొందుచున్నది. ప్రాణవాయువు రూపముగా అన్నిజీవుల శరీరములలోను ప్రవేశించే, ఆయాశరీరరూపములతో, అనేకముగా కన్పించుచున్నది. అటులనే ఆత్మ ఒకటే అయినను, సకలభూతములకు అంత

రాత్మగాయుండి లోపల, వెలుపల ఆయారూపములకు తగిన రూపములు కలవాడుగా కన్పించుచున్నాడు.

సూర్యుడు ఆధిదేవత రూపమున సకల ప్రాణులయొక్క నేత్రము లందుండి। రూపమును గ్రహింపజేయుచున్నాడు. సూర్యకాంతి లేనిచో నేత్రములు, రూపమును గ్రహించలేవుగదా! ఆనేత్రములు శుచియైన పదార్థములతోపాటు, ఆ శుచియైన మూత్ర పురీషాదులను కూడా చూచుచున్నవి. అయినప్పటికి ఆ దోషములుకాని, నేత్రములందున్న మలినములు గాని, సూర్యుని తాకుటలేదు. సూర్యుడు స్వచ్ఛమైన జలమందును. మలినమైన జలమునుప్రతిబింబంచినప్పటికి, వాటిదోషములు సూర్యునితాకుటలేదు

మసక చీకటిలో త్రాడును చూచి సర్పమని భ్రాంతిచెందినవారు, భయకంపితులై బాధలకు గురియగుచున్నప్పటికి త్రాడునకు ఏ బాధ అంట నట్లు. అజ్ఞాన జనిత భ్రాంతిచేత అహంకారముతో కూడిన చైతన్యము జీవరూపముగాయుండి కామ్య కర్మల నొనర్చుటచే కలుగు దుఃఖమును తనదిగా భావించినప్పటికి అధిష్ఠానమగు ఆత్మకు దుఃఖములంటవు. ఒక్కడేయైన ఆత్మ సర్వ భూతములందు అంతరాత్మగా యున్నప్పటికి శరీర దుఃఖలముచేత స్పృశింపబడుటలేదు. ఈ లోక దుఃఖములు బాహ్యమైనవేగాని ఆత్మకు సంబంధించినవికావు,

నచికేతా! ఆ పరమేశ్వరుడు సర్వభూతములకు అంతరాత్మస్వరూపుడు, సర్వ జగత్తు తన స్వాధీనమందున్నవాడు. అతడు ఒక్కడే అయినప్పటికి మాయ అవిద్యల సంబంధముచేత అనేక ఉపాధులతో కూడి నానా రూపములను వ్యక్తపరచుచున్నాడు. ఆ పరమాత్మ ప్రకాశము అంతః

కరణయందు ప్రసరించగానే, గాజుపలకమీద పడిన సూర్యరశ్మి అనేకరంగులతో ప్రతిబింబించినట్లు అనేక విధములుగా ప్రతిబింబించుచున్నది, ఆ ప్రకాశము మనస్సు ఇంద్రియములతో గూడుకొని, ప్రపంచమును చూచుచున్నది. ధీరులైన విద్వాంసులు బాహ్య విషయముల నుండి ఇంద్రియ వృత్తులను మరల్చి అనగా మనస్సును నానాత్వమునుండి మరల్చి, ఆత్మయందే లగ్న మొనర్చుదురు, అట్టి తీవ్ర ధ్యాన సమయములో తమను ఆత్మ స్వరూపముగానే చూచెదరు ఇట్లు ఆత్మ సాక్షాత్కారము పొందినవారే శాశ్వతమైన బ్రహ్మానందమును అనభవింతురు. వివేకహీనులైన అజ్ఞానులు బాహ్య విషయములందే కూడుకొని యుండుట చేత ఇంద్రియాతీతమైన ఆత్మానందమును అనుభవింపలేరు.

ఒక్కడేయగు ఆపరమేశ్వరుడు అనేకులకు వారివారి ఖర్మలకు తగిన ఫలములనిచ్చుచున్నాడు. ఆ పరమేశ్వరుడు అనిత్యమైనవానిలో నిత్యమైయున్నాడు, ఈ ప్రపంచము అస్థిరమైనది. నిరంతరము మారుచున్నది. ఇది క్షరము నశించునది. ఈ దేహము బాల్య, యౌవన,కౌమార వార్ధక్యములనెడు మార్పులనుపొంది చివరకు నశించుచున్నది, ప్రతిక్షణము అనేక జీవాణువులు నశించి క్రొత్త విపుట్టుచున్నవి. అక్షరమైన చైతన్యము మార్పు చెందక నశించక స్థిరముగా యున్నది. అట్టి స్థిరమైన చైతన్యము ఒకటి ఉన్నపుడే జన్మించిన శిశువు శరీరము బాల్యము మొదలగు మార్పులను చెందుటకు వీలగుచున్నది, ఈ చైతన్యము లేనప్పుడు ఆ శరీముయే

మార్పులను పొందక నశించి పోవుచున్నది. స్థిరమై సత్యమైన రజ్జువు వున్నపుడే సర్ప భ్రాంతి కలుగుచున్నది, భ్రాంతి నశించినపుడు దానితో బాటు సర్పము కూడా నశించుచున్నది. కాని సత్యమైన రజ్జువు మాత్రము మిగులుచున్నది. అటులనే స్థిరమైన మార్పులేని చైతన్యమున్నప్పుడే దాని యందు అస్థిరమైన ప్రపంచము కలుగుచున్నది. అస్థిరమైన ప్రపంచము నశించినను చైతన్యము నిత్యమైయుండును.

బ్రహ్మాది స్థావరపర్యంతము చైతన్యముగల ప్రాణులలో చైతన్య రూపుడుగా యున్నాడు, నేటికి అగ్నివలనవేడి కలిగినట్లుఅన్ని చేతనములకు ఆత్మ చైతన్యమే కారణముగా యున్నది, వస్తుతః ఇనుమునకు కాల్చు గుణములేదు. ఇనుమును అగ్నిలోవేసిన ఎఱ్ఱగా కాలిమనలను కాల్చుచున్నది. ఇనుమునకు వేడిలేకపోయినప్పటికి అగ్నినుండి వేడిని గ్రహించినది. అటులనే దేహము మనస్సు బుద్ధి మొదలగు ఇంద్రియములు జడములైనను అవి ఆత్మనుండి చైతన్యమునుపొంది. చైతన్య వంతములుగా కన్పించుచున్నవి. అందువలన ఆత్మను చేతనములలో చేతనముగా వర్ణించిరి. అట్టి ఆత్మను తమ హృదయాకాశమునందు ఏ ధీరులైన విద్వాంసులు సాక్షాత్కారము చేసుకొనుచున్నారు వారికే శాశ్వతానందము ఇతరులకు లేదు.

ఇట్టిదిని నిర్ణయించి చెప్పుటకు శక్యముకానిదియు. శ్రేష్ఠమైన ఏ సుఖము కలదో ఆ సుఖము ఇదియేయని బ్రహ్మ వేత్తలు తలంచుచున్నారని యమధర్మరాజు చెప్పగా అది ప్రకాశించుచున్నదా, లేక ఇతరపదార్థములచేత ప్రకాశింపబడుచున్నదా యను విషయమును నేనెట్లు తెలిసి

కొనగలను అని నచికేతుడు ప్రశ్నించెను, ఆశాశ్వతానందము బ్రహ్మవేత్త లకు మాత్రమే అనుభవములోనికి వచ్చునా లేక నావంటి వారికికూడా అనుభవములోనికి వచ్చునాయని కూడా ప్రశ్నించెను.

ఈ ఆత్మానందము ఇంద్రియ మనోబుద్ధులచేత తెలిసికొనుటకు గాని, అనుభవించుటకుగాని, శక్యముకానిది అయినప్పటికి బాహ్యవిషయములనుండి ఇంద్రియ వృత్తులను మరలించినవారును ఈషణాత్రయమును విసర్జించినవారును అయినవారలకు ప్రత్యక్షముగా గోచరమగుచున్నది.

దీపము తనకాంతిచేత జడపదార్థములను ప్రకాశింపజేయుచున్నది. తన కాంతిచేతనే దీపము కనబడుచున్నది. దీపమును చూచుటకు వేరొక కాంతి అవసరములేనట్లుగా ఆత్మ తనను తాను తెలిసికొనుటకు మరియొక కాంతి అవసరములేదు. మేఘములావరించినపుడు సూర్యుడు కన్పించుట లేదు. మేఘము తొలగగానే సూర్యుడు బయల్పడుచున్నాడు, అట్టిసూర్యుని చూచుటకు ఎటువంటి దీపము అవసరములేనట్లే అజ్ఞానావరణము తొలగగనే స్వయం ప్రకాశమైన ఆత్మ స్వయముగనే ప్రకాశించుచున్నది. జ్ఞానస్వరూపమైన ఆత్మను తెలిసికొనుటకు మరియుక జ్ఞానమవసరము లేదు.

ప్రపంచములోని సమస్త పదార్థములలు ప్రకాశింపజేయు సూర్యుడు ఆ బ్రహ్మమును ప్రకాశింప జేయుటలేదు. అటులే చంద్రుడు నక్షత్రములు విద్యుత్తు, అబ్రహ్మను ప్రకాశింపజేయలేవు. ప్రకాశములో తన ప్రకాశము కన్న వేరొక ప్రకాశముండదుకదా! సూర్యునిదీపము ప్రకాశింపజేయనటులే

ఆ బ్రహ్మతత్వమును సూర్య,చంద్ర నక్షత్రాదులు, ప్రకాశింపజేయలేవు. భౌతికప్రపంచములోని పదార్థములను ప్రకాశింపచేయగల సూర్యచంద్ర నక్షత్రాదులు భౌతిక ప్రపంచమును మీరియున్న ఆ బ్రహ్మ తత్వమును ప్రకాశింపజేయలేవు, ఏ సూర్యచంద్రాదులు ప్రకాశించుచున్నటుల మనకు కన్పించుచున్నదో ఆ సూర్యచంద్రాదులు ఆ బ్రహ్మననుసరించియే ప్రకాశించుచున్నవి. నేత్రము రూపమును గ్రహించుటకు సూర్యుని ప్రకాశము అవసరమగునటుల సూర్యాది తేజస్సమూహమునకు పరబ్రహ్మ ప్రకాశమవసరమగుచున్నది. అంతర్జ్యోతి సహాయమున నేత్రముద్వారా సూర్యకాంతిని తెలిసికొనగలుగుచున్నాము. కాని సూర్యకాంతి ఇంద్రియములకు అతీతముగా యున్న ఆత్మను ప్రకాశింపజేయుటలేదు. కనుక ఆత్మయే సూర్య చంద్రాదులకు కూడా ప్రకాశమునిచ్చునదిగాయున్నది. దాని ననుసరించియే అన్నియు ప్రకాశించుచున్నవి.

-: పంచమవల్లి సమాప్తము:-

## షష్టవల్లి ప్రారంభము

షష్టవల్లి ప్రారంభము :- చివరిదియగు ఈ వల్లియందు ప్రపంచము అశ్వత్థ వృక్షముతో పోల్చిచెప్పబడినది. మనము ఒక చెట్టును చూచినచో దానికి విత్తన ముండునని ఆవిత్తనమేఆని చెట్టుకు కారణమని తెలిసికొనుచున్నట్లుగా ఈ ప్రపంచమునకుకూడ ఒక కారణముండవలయునని ఆకారణము బ్రహ్మమేనని తెలియజెప్పుటకు ఈ ప్రపంచమును వృక్షముతో పోల్చి చెప్పబడినది.

ఈ సంసారము ఊర్ధ్వమూలము, అధఃశాఖలుగల అశ్వత్థవృక్షము ఇది సనాతనమైనది, దీనిమూలము పవిత్రమైనది. ఇదియే బ్రహ్మ ఇదియే అమృతమనికూడా చెప్పబడుచున్నది. దీనియందే సమస్తలోకములు ఆధారపడియున్నవి. ఎవ్వరును దీని నతిక్రమింపలేరు. ఇదియే నీవడిగిన బ్రహ్మము.

(ఈ ప్రపంచము అశ్వత్థవృక్షముతో పోల్చబడినది. వృక్షమనగా (వృశ్చనాత్-వృక్షః) నరుకబడునదియని అర్థము. అశ్వత్థమనగా అ+శ్వ+త్థ=శ్వ=రేపు, త్థ= ఉండుట, అ=లేనిది. రేపటికి ఉండనిదియని అర్థము. ఈ ప్రపంచము క్షణక్షణమూ మారుచూ నశించిపోవునదిగాన అశ్వత్థముతో పోల్చిరి. వృక్షము నరుకబడునట్లుగా ఈ సంసారరూప వృక్షముకూడా జ్ఞాన ఖడ్గముచే నరుకదగియుండుటచేత వృక్షముతో

పోల్చిరి. మరియు ప్రపంచము నశించు స్వభావము కలదైనను ప్రవాహ రూపమున సనాతనముగా యుండుటచేత నిశాలమై ఎక్కువకాలము జీవించు అశ్వత్థ వృక్షముతో పోల్చిరి. చెట్టునకు అన్నిభాగములలోను వేరు (మూలము) ముఖ్యమైనది వేరు భూమినుండి నీటిని ఆహారమును తీసికొని తక్కిన వృక్షభాగములకు అందించుచున్నది. చెట్టు జీవించుటకు ఆహారము ముఖ్య ముగనుక అట్టి ఆహార ము వేరుద్వారా లభించుటచేత మూలమును ఊర్ధ్వమనిరి. ఊర్ధ్వమనగా పైన అని అర్థము కాకుండ. శ్రేష్ఠ మనే అర్థములో వాడబడినది. ప్రపంచ వృక్షమునకు మూలము ఊర్ధ్వము అనగా (తద్విష్ణోఃపరమంపదం) విష్ణుపదము మరియు పంచభూతములు అహంకారము మహత్తు, అవ్యక్తము అనునవి ఒకదానికన్న మరియొకటి సూక్ష్మము వ్యాపకత్వము కనిగియున్నవి. అవ్యక్తముకన్న బ్రహ్మము సూక్ష్మాతి సూక్ష్మము. సర్వవ్యాపియైయున్నది అట్టి సర్వ వ్యాపియైన ఆ పరబ్రహ్మమునుండి ఈ ప్రపంచము సృష్టినిపొందుచున్నది. అందుచే దీనిమూలమును ఊర్ధ్వమనిరి మూలముతో పోల్చినపుడు శాఖలు అంత శ్రేష్టతను పొందుటలేదు. కాబట్టి అధః శాఖయనిరి, దాని శాఖలు దేవ, మానవ, పశు, పక్ష్యాదులు ఊర్ధ్వముగా నున్న బ్రహ్మతో పోల్చినపుడు అధమముగా యుండుట చేతకూడా అధఃశాఖయనిరి. స్థూల దేహమును కూడా అశ్వత్థమ వృక్షముతో పోల్చవచ్చును. వృక్షమువలె ఇదికూడా జ్ఞానఖడ్గముచేత నరుకబడుచున్నది, సూక్ష్మశరీరమే కాండముగా గలిగి ఇంద్రియ విషయములను చిగురుటాకులు గలిగి వేద, న్యాయ, విద్యోపదేశములే ఆకులుగా గలిగి ధర్మాధర్మంలను పుష్పములను, సుఖ దుఃఖములను, ఫలములను కలిగి ఆశయను నీటిచే వృద్ధి పొందుచు, అసంగశాస్త్రముచేనరుకబడతగియున్న ఈ స్థూలశరీరం అశ్వత్థ వృక్షముగా యున్నది.

సంసార వృక్షమునకు మూలము ఏదియో అది స్వప్రకాశము. అదియే అన్నిటికన్న మహత్తగుటచేత బ్రహ్మమనిరి. అది అవినాశి యగుటచేత అమృతమనిరి, ఆ బ్రహ్మమునందు సమస్తలోకములు ఆశ్రయించి యున్నవి. ఆ బ్రహ్మము నేదియు నతిక్రమింపలేదు)

ఈ విశ్వమంతయు ఆ బ్రహ్మమునుండి ఉద్భవించినది,ఆ బ్రహ్మములోనే కంపించుచున్నది. వజ్రాయుధం ధరించినవానిని చూచి ఇతరులు భయపడునట్లు ఆ బ్రహ్మనుచూచి ప్రపంచము భయపడుచున్నది. ఆబ్రహ్మమును తెలిసికొన్నవారు అమృతత్వమును పొంధుచున్నారు,

(ఇంతకుముందు ప్రపంచముయొక్క మూలము బ్రహ్మములోనే యున్నట్లు చెప్పబడినది. ఆ విషయమును ధృవపరచుటకు మరల ఈ విధముగా చెప్పబడుచున్నది. విశ్వమంతయు బ్రహ్మములోనే సృష్టి, స్థితి లయములు పొందుచున్నది, జీవనహేతువైన ఆ పరబ్రహ్మమునుండియే ప్రాణశక్తిని పొంది స్పందించుచున్నది. గ్రహణములు, నక్షత్రములు మొదలగునవి. అన్నియు కదలుటకు బ్రహ్మమే కారణముగాయున్నది. శరీరముల కదలికయు, వానిలోనిఅణువులు కదలికయు ప్రాణశక్తివలననే కలుగుచున్నది. అణువును విడగొట్టిన దానిలో న్యూట్రానులు, ప్రోట్రానులు, నిరంతరము స్పందించు ఎలక్ట్రానులు, యున్నటుల కనుగొన్నారు, 'అణోరణీయాన్ మహతో మహీయన్' అన్నట్లుగా అణువులోని ఎలాక్ట్రానులు యున్నటుల స్పందనము, అణువుల స్పందనము మొదలుగ్రహనక్షత్రముల స్పందనము వరకుగల స్పందనమంతయు బ్రహ్మమువలననే జరుగుచున్నది. ప్రపంచలయముకూడా బ్రహ్మములోనే జరుగుచున్నది. అచలమైన బ్రహ్మమునందే చలనశీలమైన ప్రకృతి ఉద్భవించినది, ఒక

దివిటీని వెలిగించి దానినిఒకే కేంద్రమునుండి గిరగిరా త్రిప్పినచో నిప్పు చక్రమువలె మనకు కన్పించుచున్నది. దివిటీ కొన నిరంతరము గిరగిర తిరిగినపుడే చక్రముకన్పించుచున్నది, ఏకేంద్రము నుండి తిరుగుచున్నదో ఆ కేంద్రము స్థిరముగా నున్నది. చలనములేని స్థిరమైన ఆధారమున్నపుడే చలనముతో కూడిన దివిటీ చక్రమేర్పడుటకుకారణముగాయున్నది. అచలమైన బ్రహ్మము వలననే విశ్వమునకు చలన శక్తి లభించినది.)

నచికేతా! ఆబ్రహ్మము యొక్క భయముచేతనే అగ్ని దహించుచున్నది.సూర్యుడుతాపమునొసంగుచున్నాడు.ఇంద్రుడు,వాయువు,మృత్యువు తమతమ పనులను చేయుచున్నవి. ఆయుధము ధరించిన ప్రభువునుచూచి సేవకులుతమతమ పనులను నియమప్రకారము చేయునటులసూర్య,అగ్ని, వాయువు మొదలగునవి తమతమ పనులను తమతమ నియమము తప్పక పాటించుచున్నవి. యజమానిలేనిచో సేవకులు తమ పనులు సక్రమముగా చేయనటులు సమస్తమునకు ప్రభువైన బ్రహ్మమే లేనిచో ప్రపంచగతియే లేకపోవును, ఈ జీవితములోనే ఈ శరీరము పడిపోవుటకంటె ముందుగానే అనగా మరణించకముందే సూర్యాదులకు కూడా భయకారణమైన ఆ బ్రహ్మమును తెలిసికొనినవారు ముక్తులగుదురు.అట్లు తెలిసికొనినవారు మరణాంతరము మరలమరల జనన మరణముల పాలగుదురు.

(ఆత్మ జ్ఞానములేనివారు దేహమే తానను భ్రమలోయుండి తాము చేయు కర్మల ఫలమును సుఖ దుఃఖరూపముగా అనుభవించుచు దేహభ్రాంతితోనే మరణించుచున్నారు, అట్టివారు పృధివ్యాది లోకములలో మరల మరల జన్మించుచున్నారు. చీకటి వెలుతురు వలన నశించునట్లు

ఆత్మజ్ఞానము వలన అజ్ఞానము నశించును. అజ్ఞానము నశించినగాని దేహ
భ్రాంతి వదలదు. దేహభ్రాంతి వదలనంతవరకు మోక్షమునకు అర్హతను
పొందలేరు:)

జీవరాసులన్నింటిలోను మానవదేహమే ఆత్మజ్ఞానమునకు అనగా
బ్రహ్మను తెలిసికొనుటకు శ్రేష్ఠమైన సాధనముగా శాస్త్రములు చెప్పు
చున్నవి అట్టి మానవదేహము ప్రాప్తించినప్పటికి ఆత్మను తెలిసి
కొనుటకు ప్రయత్నించని వారి జన్మ వృధాయగుచున్నది.
వారు మరల మరల అనేక జన్మలను పొందవలసివచ్చుచున్నవి. దీప
ముండగనే ఇల్లు చక్కబెట్టుకొనుము అను సామెత యున్నట్లుగా ఏ
జ్యోతి వునికి వలన ఈ దేహము నడచుచున్నదో ఆ జ్యోతి ఈ దేహ
మును విడువకమునుపే తీవ్రప్రయత్నముచేసి సద్గురువులవలన ఆత్మజ్ఞాన
మును పొంది ఆత్మ సాక్షాత్కారము చేసుకొనవలయును. అట్టి ప్రయ
త్నము చేయనిచో ఇతరలోకములలో ఇతరదేహములతో ఆత్మను తెలిసి
కొనుట సులభముకాదు. జాగ్రదావస్థలోని విషయములను స్పష్టముగా
గుర్తించినట్లు స్వప్నములో గుర్తించలేము అటులనే ఆత్మను పితృలోక
ములో అస్పష్టముగా మాత్రమే గుర్తించగలము. నీటిలోని ప్రతిబింబము
వలె గంధర్వలోకమున గుర్తించగలము. ఎండనీడలను స్పష్టముగాగుర్తిం
చినట్లు బ్రహ్మలోకములో ఆత్మను గుర్తించవచ్చును. కాని ఇది కష్ట
సాధ్యము. ఉపాసకులు బ్రహ్మలోకమునచేరి బ్రహ్మతోపాటు ఆత్మవిచా
రణచేయుచు బ్రహ్మ ప్రళయ సమయమున ఆత్మ సాక్షాత్కారము నొంది
బ్రహ్మతోపాటు ముక్తిని పొందుదురు.

8)

ఇక ధ్యానశీలుడైన మానవుడు తనబుద్ధిని పరిశుద్ధమొనర్చుకుని అద్దములో తనముఖమును స్పష్టముగా చూసినట్లు బ్రహ్మను చూడగల్గుచున్నాడు. అద్దములో నీముఖమును చూచినపుడు నిన్నునీవే చూచుచున్నావు గదా! అటులనే అహంకారముతో కూడిన జీవాత్మ బాహ్య విషయముల నుండి మరలి అంతర్ముఖమై బుద్ధి వృత్తులనధిగమించినపుడు ఏ జ్ఞానము వలన అన్నిటిని గుర్తెరుగుచున్నాదో ఆ జ్ఞానము పరిశుద్ధ జ్ఞానముగా మిగులుటను గుర్తించి దానియందే లీనమగును. కనుక ఈ శరీరము పడిపోవుటకు ముందుగానే ఆత్మ సాక్షాత్కారము చేసుకొనవలయును.

ఈ జీవిత కాలములోనే ఆత్మ సాక్షత్కారమునకు ఎందుకు ప్రయత్నించవలెనను సంశయముగలవారికి సమాధానము చెప్పబడుచున్నది.

జ్ఞాని శ్రోత్రాది ఇంద్రియములు తమ కారణములగు ఆకాశాదిపంచ భూతములనుండి వేరువేరుగా పుట్టినవనియు, అవివేరుగా ఒక్కొక్క విషయమునే గ్రహించుచున్నవనియు, వానికి ఉత్పత్తి నాశనములు కల వనియు, ఉత్పత్తి నాశనములులేని ఆత్మకంటె వేరైనవనియు, తెలిసికొని దుఃఖములను పొందడు ఇంద్రియములకు కారణము పరస్పర భిన్నముగా యున్నది. వాటి విషయగ్రహణముకూడా భిన్నముగనే యున్నది. ఒక్కొక్క ఇంద్రియము ఒక్కొక్క విషయమునే గ్రహించుచున్నధి. జాగ్రదవస్థలో విషయములను గ్రహించినప్పటికి సుషుప్తి అవస్థలలో ఇంద్రియములు మనోబుద్ధులతోకూడా లయమగుచున్నవి. మరల జాగ్రదవస్థలోనేవిషయముల గ్రహించుచున్నవి, మరియు ఉత్పత్తి నాశములు కలిగియున్నవి. కాని ఆత్మ జాగ్రదావస్థలో ఇంద్రియములు విషయములను గ్రహించునపుడును, సుషుప్తిలో లీనమగునపుడును, అన్నిటిని గుర్తించుచు

ఏక మాత్రముగా ఉంటున్నది. ఇంద్రియములవలె ఆత్మ ఉత్పత్తి నాశము లులేనిది, ఆత్మ శాశ్వతత్వమును ఇంద్రియముల నశ్వరత్వమును తెలిసిన జ్ఞాని దుఃఖములను పొందడు. 'తరతి శోకమాత్మ త్' అను శ్రుతిగూడా ఈ విషయమునే చెప్పుచున్నది.

ఇంద్రియాతీతమైన పరతత్వమును గ్రహించుట సులభముకాదు గావున మరల స్థూలములైన ఇంద్రియములనుండి సూక్ష్మాతి సూక్ష్మమైన ఆత్మను చేర్చు మార్గము వివరింపబడుచున్నది. ఇంద్రియముల కన్న మనస్సు అంతరము, సూక్ష్మము మనస్సునకు అంతరముగా బుద్ధియున్నది. బుద్ధికి అంతరముగా మహత్తత్వము దానికి అంతరముగా అవ్యక్తము. అవ్యక్తానంతరముకసూక్ష్మమైన ఆత్మయున్నది. ఆఆత్మ సర్వవ్యాపి లింగరహితుడు. (ఏలక్షణములులేనివాడు)ఆత్మ సూక్ష్మాతి సూక్ష్మముగనుక సూది మొనమోపసందులేక అంతటానిండి నిబిడీకృతమై సర్వవ్యాపిగాయున్నది, ఇంద్రియములు, మనస్సు బుద్ధి మొదలగువానిని గుర్తించునటుల ఆత్మను గుర్తించుటకు ఏ చిహ్నములులేవు అట్టి ఆత్మను స్వానుభవముతో తెలిసికొన్నవాడు సంసార బంధమునుండి విముక్తుడై శాశ్వతమైన అమృతత్వమును పొందుచున్నాడు. "బ్రహ్మవిద్బ్రహ్మైవభవతి" అను శృతి ఈ విషయమునే చెప్పుచున్నది, దూరముగాయున్న పొగనుచూచి అచట అగ్నియున్నటుల ఊహించుచున్నాము, ఏ గుర్తును చూచి మనము అగ్నియున్నట్లు నిర్ణయము చేసితిమో అట్టి గుర్తును తర్కశాస్త్రములో లింగము అని అనెదరు. పొగనుబట్టి అగ్నియున్నట్లు గుర్తించినట్లు ఈ ఆత్మను పూటిగాగుర్తించుటకు తగిన లక్షణములులేవని చెప్పుటకే అలింగమనిరి

ఆ బ్రహ్మముయొక్క రూపమును ప్రత్యక్షము గాదు. అందుచేత ఎవరును అతనిని ఈ చర్మ చక్షువులతో చూడలేరు, చక్షువులతోనేగాక ఏ ఇంద్రియముతోను తెలిసికొనలేరు, అది యింద్రియ గోచరముకాదని మాటిమాటికి చెప్పుటచేత సామాన్య సాధకులు అలసభావముతో తమ ప్రయత్నములను విరమింపక మనిస్సును స్వాధీన పరచుకొనుటకు ప్రయత్నింపవలెను. మనస్సు వశమైనచో బుద్ధికూడు బాహ్యవిషయములనుండి మరలి ప్రశాంతి నొందును, అట్టి బుద్ధి చేతనే ఆత్మను సాక్షాత్కరింప గలరు. బుద్ధి శుద్ధమైనపుడు ప్రశాంతినొందినపుడు మలిన ఎరుకనశించి శుద్ధమైన ఎరుకమాత్రమే మిగులును, ఆశుద్ధ ఎరుకయే ఆత్మను స్ఫురింప జేయుచున్నది. ఆత్మను తెలిసికొనుటయనగా తననుతాను తెలిసికొనుటయే యగుచున్నది, ఈ విధముగా ప్రత్యగ భిన్న పరమాత్మను తెలిసికొన్న వారు. అమృతత్వమును పొందుచున్నారు.

—। సమాధియుక్క అనుభము చెప్పబడుచున్నది ।—

శ్రోత్రాది జ్ఞానేంద్రియములను, వాటి విషయములనుండి మరల్చి మనస్సును సంకల్ప రహితముచేయవలెను. మనస్సు ఇంద్రియములతో కూడి వ్యవహరించినపుడు అనే కాగ్రముగా యుండును. అట్టి మనస్సును ఇంద్రియ విషయాదులనుండి మరల్చి ఆత్మయందే స్థిరముగా నిలుపవలయును, అప్పుడు ఆ మనసు ఏకాగ్రమగును. మనస్సు ఏకాగ్రమయినపుడు బుద్ధికూడా నిశ్చలమగును, వ్యాపారరహితమైన స్థితిలో నుండును. అనగా ఇంద్రియములు, మనస్సు, బుద్ధి బాహ్య విషయ వ్యాపారముననుండి మరలియుండును, నిశ్చలమైనట్టి ఈ స్థితిని పరమగతియనుచున్నారు. అట్టి స్థితిని పొందినవారే జీవన్ముక్తులు.

సుషుప్తి అవస్థలో కూడా ఇంద్రియమనోబుద్ధుల వ్యాపారముండుటలేదు. అయినప్పటికి ఇవి అన్నియు అజ్ఞానములో లయమొందుటచేత నాకేమియు తెలియలేదను భావములు కలుగుచున్నవి. కాని సమాధిస్థితిలో ఇంద్రియ వ్యాపారములు జ్ఞానప్రకాశములో లయమగుచున్నది. తాను జ్ఞాన స్వరూపుడుగాయుంటున్నాడు, జాగ్రత, స్వప్న, సుషుప్తి, అవస్థలను సాక్షిరూపముగా ఏ జ్ఞానము తెలిసికొనుచున్నదో మూడవస్థలను మీరినప్పుడుఆ జ్ఞానమే కేవలము మిగులుచున్నది. తానే అజ్ఞాన స్వరూపుడుగా యున్నాడు. సమాధీ స్థితిని బొందుటను సుషుప్తిలో జారిపోకుండా జాగ్రత్త పడవలసియున్నది.

బాహ్యేంద్రియ అంతరేంద్రియముల నిగ్రహించుటనే యోగమని చెప్పబడుచున్నది. అట్టి ఇంద్రియంనిగ్రహము స్థిరముగా యున్నచో యోగము సిద్దించునట్లగును. అటువండి యోగి ఇంద్రియములను వశము నందుంచుకొనుటచే ప్రమాదములకు లోనుకాడు. అప్రమత్తుడై యోగము నభ్యసించువానికి చిత్త విక్షేపాది దుష్ట సంస్కారములు నశించి స్వాత్తిక సంస్కారములుదయించును. ఈ సాత్వికవృత్తి యోగిని కాపాడి సిద్ధిని కలుగచేయును.

బ్రహ్మము వాక్కుచేత, మనస్సుచేత, చక్షురింద్రియముల చేతగాని పొందుట శక్యముగానిది, కర్మేంధ్రియముల చేతగాని జ్ఞానేంద్రియముల చేతగాని అంతరింద్రియముల చేతగాని గుర్తించుటకువీలులేనిది.అద్ధముతన ఎదురుగావున్న వస్తువులను మాత్రమే:చూపగల్గునట్లు,అంతరింద్రిజ్ఞానేంద్రియకర్మేంద్రియములతో కూడినపుడువానికెదురుగావున్నశబ్ధాదివిషయంలను

గ్రహించుచున్నవి, మనోబుద్ధులను దాటి వాటికతీతముగాయున్న బ్రహ్మను ఇవిఏవియు గుర్తింపలేకున్నవి. ఇంద్రియములన్నియు భౌతిక పదార్థము లనే గుర్తింపగలవు ఆత్మ అభౌతిక మగుటచేత దానిని గుర్తింపలేకున్నవి మనస్సు ఇంద్రియములు ఆత్మయునికి వలననే చైతన్య వంతములై వాటి వాటి పనులను చేయగల్గుచున్నవి, ఆత్మలేనపు ఏ ఇంద్రియములు పనిచే యుటలేదుగదా! ప్రపంచము ఉన్నదనియే అందరు అంగీకరించుచున్నారు గదా; అట్టి ప్రపంచమునకు కారణమైన ఆత్మ ఉన్నదనియే గ్రహింపవలయును, ఆత్మయొక్క ఉనికిని గూర్చి 'అదిఉన్నది' యని చెప్పువారినుండిగాక ఎట్లుతెలియగలదు? తర్కమువలన అదితెలియబడదు. ఆత్మను తెలిసికొనుగోరువారు వేదప్రమాణమునందును. అనుభవశాలురగు గురువుల వాక్యములందును విశ్వాసముంచి శ్రద్ధతో నిరంతరధ్యానముతో ప్రయత్నించిన ఆత్మ లభ్యమగును. ఆకాశములోనుండు ధృవనక్షత్రమును గాని, మరి ఏయితర నక్షత్రమునుగాని అదివరకుచూచివవారుచెప్పుటచేతనే మనకు తెలియుచున్నది. అటులనే ఆత్మను సాక్షాత్కరించుకొనిన గురు జనులు చెప్పిన మీదటనే ఉన్నట్లు తెలియుచున్నవి. వారిమాటలను విశ్వ సించి ప్రయత్నించినవారికే ఆత్మ ఉనికి తెలియగలదు. లేదనువారి మాట లను విశ్వసించిచో ప్రయత్నములోనే లోపమేర్పడుచున్నది, వారు ఆత్మను తెలిసికొనలేరు.

(ఆత్మ ఉన్నదని తెలిసికొనుటకు మనకు ప్రత్యక్షముగా కన్పించు ప్రపంచముయొక్క ఉనికి వలన దాని కారణమగు ఆత్మను గుర్తింప వచ్చును. పృధివ్యాది తత్వములు మనకు ప్రత్యక్షముగా కన్పించుచున్నవి గదా! వానిలోనుండు చైతన్యమువలవనే అవి యున్నటుల తెలియుచున్నది మన, శరీరములో ఒక చైతన్యమున్నపుడే శరీరేంద్రియములలో కదలిక వృద్ధిక్షయములు కలుగుచున్నటుల తెలిసికొనుచున్నాము. ఆ చైతన్యము

లేనపుడు కదలికలే జడమైపోవుచున్నదిగదా। ఇట్లు ఆత్మ అస్థిత్యముచూడ గలుగుచున్నాము. అటులనే నిర్గుణమైన శుద్ధ స్వరూపమును తెలిసికొన వచ్చును- ఓంకార విచారణరూ'ఓం' సగుణ నిర్గుణములుగా యున్నటుల తెలిసి కొంటిమి. ఓంకారముయొక్క పాదములు (అకార, ఉకార, మకారములు) అవస్థలు, అభిమానములు సగుణముగా యున్నవి. అకార ఉకార మకారములు సగుణముగా యున్నను, అమాత్ర నిర్గుణముగాయున్నది. సాధకుడు అకార ఉకారములను, వానియవస్థలను, అభిమానులను విచారణ చేయుచు అమాత్రయగు నిర్గుణబ్రహ్మము గాంచుచున్నాడు. ఓంకారమును సగుణారాధనచేయుట కన్న నిర్గుణమైన పరపూర్ణత్వమునే ధ్యానించుట యుత్తమము। ప్రపంచము జడమైనను ఆత్మసత్తవలన అస్థిత్వముగలదియగుచున్నది. ఆత్మయొక్క అస్థిరూపముచేతచే అనాత్మ పదార్ధలన్నియు అస్థిరూపములగు చున్నవి. ఈ విధముగా అస్థిరూపాత్మకు తెలిసికొనినవాని అంతఃకరణమందు తత్వభావమగు శుద్ధ స్వరూపము ప్రకాశించును.)

మానవుని అంఃతకరణమునందు సమస్త కామములు ఆశ్రయించి యుండును. కామములతో కూడిన అంతఃకరణమునందు ఆత్మసాక్షాత్కారముగాదు. ఎప్పుడీ కోర్కెలన్నియు నశించునో అప్పడు మరణయుక్తుడగు మర్త్యుడు మరణరహితుడగుచున్నాడు. ఇచటనే బ్రహ్మను పొందుచున్నాడు. వైరాగ్యముతో కూడినవారలకు కామములు నశించును. 'పరం దృష్ట్వా నివర్తతే అనుస్మృతి చెప్పుచున్నట్లుగా ఇంకను కామవాసన మిగిలి యున్న, అశుద్ధ స్వరూపదర్శనముతో కామవాసన పూర్తిగా నశించును. ఘుమ ఘుమలాడు ఘృతమును చూడగానే తైలము నందు ఆశనశించు

నట్లు ఆత్మ దర్శనముచే కామములన్నియు నశించును. కామములతో కూడి యున్నంతవరకు మర్త్యుడగుచున్నాడు. అనగా మరణ ధర్మమును పొందు చున్నాడు. కామములు నశించుటచేత ఆ మర్త్యుడే అమరుడగుచున్నాడు అగ్ని కట్టెలను కాల్చినచోటనే చల్లారిపోవునట్లు అతడు ఇచటనే బ్రహ్మ మును పొందుచున్నాడు. జీవన్ముక్తుడగు చున్నాడు. బూడిదను మరల మరల కాల్చుటకు వీలులేనట్లు ఈ జీవన్ముక్తుని మరణము మాటిమాటికి సమీపింపలేదు.

నచికేతా: నేను శరీరాదులకన్న భిన్నమైన ఆత్మ స్వరూపుడనను జ్ఞానము కలుగుటతోడనే కామములన్నియు నశించును, ఈ శరీరములో జీవించియుండగనే నంశించుచున్నవి. అవిద్యాగ్రంథులు నశింపగనే మాన వుడు మోక్షమును పొందుచున్నాడు,

(ఇక ఉత్క్రమణను గూర్చి చెప్పబడుచున్నది, ఇంతవరకు బ్రహ్మజ్ఞానము వలన కర్మలన్నియు నశించుటచేత ఇచట జీవించియుండ గనే బ్రహ్మభావమును పొందుచున్నటుల చెప్పబడినది, ఇట్టి జ్ఞానికి ఉత్క్రమణ చెప్పబడియుండలేదు, 'నతస్యప్రాణాఉత్క్రామంతి బహ్మై వసన్ బ్రహ్మాప్యేతి' బృహ-4-4-6.అనుశృతికూడా జ్ఞానికి ఉత్క్రమణ లేదని చెప్పుచున్నది,

'స్పష్టో హ్యేకేషామ్' బ్ర-సూ 4-2-13 జ్ఞానియొక్క ప్రాణములు లేచిపోవనుటను శ్రుతి విస్పష్టముగా చెప్పియున్నది. ప్రాణములు ఎచ్చటి వచ్చటనే లీనమగును. 'తానిపరేతథాహ్యా హ' 4-2-15 బ్ర. సూ జ్ఞానుల సూక్ష్మ శరీరము బ్రహ్మ భేదము నొందునని వేదము చెప్పుచున్నది,

'అవిభాగోవచనాత్' (బ్ర, సూ.4-2-16. జ్ఞానుల లింగశరీరము పరబ్రహ్మ మున నిర్విశేషముగలయమొందును. ఎందుకనగా అవిద్యచే కలిగినది గనుక బ్రహ్మవిద్యచే లింగశరమునశించుచున్నది. కనుకజ్ఞానికి ఉత్క్రమణలేదు అని ఈవిధముగాయున్నప్పటికి ఇకముందుఉత్క్రమణనుగూర్చి చెప్పబడుచున్నది. ఉపాసకులకు, యోగులకు, ఉత్క్రమణ చెప్పబడినది. వారు బ్రహ్మలోకమునుపొంది బ్రహ్మతోపాటు మోక్షము పొందుదురు. కామ్యకర్మలను చేయువారు మరల మరల జన్మించుచున్నారు. కనుక వీరిని గురించియే ఉత్క్రమణ చెప్పబడినది,)

నచికేతా! మనహృదయమునందు అతిసూక్ష్మమైన నూట ఒక్క నాడులున్నవి. ఇవి కంటికి కన్పించునవికావు. ఈ నూట ఒకనాడులలో సుషుమ్నయను నాడి హృదయమునుండి శిరస్సువరకు వ్యాపించియున్నది. అవసానకాలమంధు యోగి ఈ సుషుమ్నా నాడిద్వారా ఊర్ధ్వమునకు పయనించి మోక్షమును పొందును. ఇతరనాడుల ద్వారా పయనించినవారు నానావిధములగు గతులను పొందుచున్నారు,

జనులందరి హృదయాకాశమునందు అంతరాత్మ స్వరూపుడుగా యున్న ఆ అంగుష్ఠమాత్రపురుషుని తామరతూడులోని ఈనెను తీసినట్లు మెల్లగా తమ దేహమునుండి వేరుపరచవలెను.

(అంగుష్ఠపరిమాణముగల హృదయాకాశమునందుండుట వలన ఆ యాత్మను అంగుష్ఠమాత్ర పురుషుడనిరి. ఆత్మనామ రూప రహితుడై నప్పటికి సాధకుల ఏకాగ్రత కొరకు పరిమాణ సహితముగా చెప్పబడినది తామరతూడులోని ఈనె అతిమృదువుగా యుండును. దానిని తామరతూడు నుండు వేరు పరచవలయుననిన అతిజాగ్రత్తగానెమ్మదిగా వేరుచేయవలెను. అటులనే పంచకోశములకు అంతరముగాయున్న ఈ ఆత్మను ప్రమాద రహితమైన జ్ఞానముద్వారా పంచకోశములనుండి వేరు పరచవలయును. అట్లు వేరుపరచుటలో తొందరపాటు పనికిరాదని చెప్పుటకే తామరతూడు ఉపమానమీయబడినది.)

దేహమనోబుద్ధులనుండి వేరు పరచిన ఆ యాత్మనే శుద్ధమైన బ్రహ్మముగా నెరుగవలయును. ఈ విధముగా మృత్యుదేవతచేత జ్ఞానము, యోగపద్ధతి ఉపదేశింపబడిన నచికేతుడు సమస్త పాపములనుండి మరణమునుండి విముక్తుడై బ్రహ్మమును పొందుచున్నాడు. అటులనే దీని ననుసరించిన ఇతరులుకూడా బ్రహ్మమును పొందుచున్నారు.

(మృత్యుదేవత ఈ విధముగా జ్ఞానమును యోగ సహితముగా నచికేతునకుపదేశించి మౌనము వహించెను. శ్రవణము చేసిన నచికేతుడు చాలా సంతోషించెను. అనంతరము మనన, నిధి, ధ్యాసలచే ఆత్మ సాక్షాత్కారమును పొంది జీవన్ముక్తుడయ్యెను.

నచికేతునివలె ధృఢమైన పట్టుదల, వైరాగ్యము, వివేకము, మొదలగు సాధన సంపత్తిగల జిజ్ఞాసులెవరైనను కుశలురైన ఆచార్యులవలన బ్రహ్మజ్ఞానోపదేశమును పొంది ఇంద్రియములను వశమొనర్చుకొని మనస్సును కామ క్రోధాదులనుండి మరలించి, ఏకాగ్రమొనరించినవారికి మనన నిధి ధ్యాసలచేత క్రమముగా ఆత్మ సాక్షాత్కారమగును.)

ఆత్మ జ్ఞానమువలన పాపములన్నియు నశించి వాని ధ్యానము స్థిరమగును. అట్టివారు శాశ్వతమైన పరిపూర్ణ తత్వమునందు తూష్ణీం భావమును వహించెదరు.

ఓం సహనావవతు । సహనౌభునక్తు । సహవీర్యంకరవావహై ।
తేజస్వినావధీ తమస్తు । మావిద్విషావహై ।

ఓం శాంతిః శాంతిః శాంతిః